

ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద వర్షపు నీటిలో వస్తున్న వాహనాలు



ఒంగోలులోని బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వానా..వానా.. వెల్లువాయె..

అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి మంచి వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం ఎండ తీవ్రత, ఉక్కపోత ఉండగా మధ్యాహ్నం రెండు గంటలకు పూర్తిగా మబ్బులు వచ్చాయి. ఒంగోలులో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో సాయంత్రానికి వాతావరణం చల్లబడింది. కొండపి, దొనకొండ, దర్శి, కురిచేడు, ముండ్లమూరు తదితర మండలాల్లో గట్టి వాన పడింది. గురువారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 9.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఒంగోలు రూరల్ మండలంలో 53.2 మి.మీ, కొండపిలో 50.8, నాగులుప్పలపాడులో 40.8, కొత్తపట్నంలో 24.2, దర్శిలో 23.2, సంతనూతలపాడులో 22.2, మద్దిపాడులో 20.2, టంగుటూరులో 17.2, చీమకుర్తిలో 14.0, కొనకనమిట్లలో 10.0మి.మీ. వర్షపాతం నమోదైంది. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు కలెక్టరేట్

పారదర్శకత.. జవాబుదారీతనం

సమష్టి కృషితో ప్రజలకు చేరువకావాలి

పోలీసు అధికారులతో ఎస్పీ హర్షవర్ధనరాజు



ఒంగోలుక్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీతనంతో సేవలు అందించి చేరువ కావాలని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం స్థానిక పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో జిల్లాలోని పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని కేసుల దర్యాప్తులో ముందుకు వెళ్లాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం యువతలో అవగాహన పెంచాలని అన్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి, చట్టపరిధిలో సత్వర న్యాయం అందేలా పనిచేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, చిన్నపిల్లల కేసుల విషయంలో పోలీసులు అత్యంత వేగంగా స్పందించాలని ఆదేశించారు. ప్రతి పోలీసు స్టేషన్‌లో రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, కేసులకు

మిగతా 6లో...

డీఎస్సీ నియామకాల ప్రక్రియ వాయిదా

ఒంగోలు విద్య, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు జారీ చేసేందుకు అమరావతి సచివాలయ సమీపంలో శుక్రవారం జరగాల్సిన ప్రక్రియ వాయిదా పడింది. కార్యక్రమ నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేశారు. అయితే అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు, క్లౌడ్‌బరస్ట్ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నట్లు వాతావరణ శాఖహెచ్చరికలు జారీచేయడంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. దీంతో ఈ కార్యక్రమం నిర్వహణకు మూడు రోజులుగా జిల్లాలో జరుగుతున్న భారీ ఏర్పాట్లు నిలిచిపోయాయి.

డీఎస్సీలో ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, గిరిజన సంక్షేమ

మిగతా 6లో...



భూములను పరిశీలిస్తున్న జేసీగోపాలకృష్ణ

భూముల పరిశీలన

- బయోగ్యాస్ ప్లాంట్ కోసం తర్లుపాడు మండలంలో..
- నిమ్స్ కోసం పామూరు మండలంలో జేసీ పర్యటన

7

ఒంగోలు-దొనకొండ రైల్వేలైన్‌పై

కదలిక



కేంద్రం రెడీ చేసిన డీపీఆర్‌ల జాబితాలో ప్రతిపాదనలు

- ఆశాజనకంగా నడికుడి-శ్రీకాళహస్తి మార్గం
- ఆ లైనులో అనుసంధానం ద్వారా మూడు కీలక మార్గాలను కలిపే అవకాశం
- విజయవాడ-గూడూరు మధ్య మరో లైనుపైనా దృష్టి

జిల్లాలో ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిన ఒంగోలు-దొనకొండ రైల్వే లైను మళ్లీ తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ ప్రస్తుతం సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)లు సిద్ధం చేస్తున్న జాబితాలో ఈ లైన్ ప్రముఖంగా ఉండటంతో పనులపై ఆశలు రేకెత్తుతున్నాయి. సుమారు 87 కిలోమీటర్ల ఉండే ఈ లైను నిర్మాణం ద్వారా తూర్పు ప్రాంతంలోని విజయవాడ-గూడూరు మార్గంలో అలాగే పశ్చిమ ప్రాంతంలోని గుంటూరు- గుంతకల్ రైల్వే మార్గాలకు కనెక్టివిటీ ఏర్పాటు అవుతుంది. దీనివల్ల రవాణా సౌకర్యం మరింత మెరుగవుతుంది.

ఒంగోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నుంచి చీమకుర్తి, పొదిలి మీదుగా నిర్మించే 87 కిలోమీటర్ల రైలు మార్గమిది. ఈ మార్గం ద్వారా ప్రధానమైన చీమకుర్తి గ్రానైట్‌తో పాటు పశ్చిమ ప్రాంతంలోని వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, జిల్లా కేంద్రమైన ఒంగోలుకు పశ్చిమ ప్రాంతాన్ని రైల్వేతో అనుసంధానం చేయడం ప్రధాన ఉద్దేశం. అయితే గతంలో సర్వేచేసి అధికారులు అవసరమైన స్థాయిలో రాబడులు ఉండవని నివేదికలను ఇవ్వడంతో మంజూరు కాకుండా నిలిచిపోయింది. అలా దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ముందుకు సాగని ఈ రైల్వే మార్గం వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో..

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాలు, సమన్వయం నేపథ్యంలో రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధి, మౌలిక సదుపాయాల పెంపుపై కేంద్రం దృష్టి సారించింది. అందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే లైన్లు ఉన్న మార్గాలలో అదనపు లైన్లు, ఇతరత్రా అంశాలపై కసరత్తు జరుగుతోంది. అలా మొత్తంగా రాష్ట్రంలో 1960 కి.మీ. మేర 26 రైల్వే ప్రాజెక్టులకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్)లను సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు ఆఖరుకు ఈ డీపీఆర్ సిద్ధం కానున్నట్లు తెలుస్తోంది. అందులో ఒంగోలు-దొనకొండ రైల్వే మార్గం ఉంది. ప్రస్తుతం విజయవాడ-గూడూరు రైల్వేమార్గంలో మూడు లైన్లు ఉండగా మరో లైను నిర్మాణంపై కూడా ఇదే జాబితాలో ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. తొలుత ఒంగోలు-దొనకొండ రైల్వే మార్గాన్ని ప్రతిపాదించిన సమయంలో విజయవాడ-గూడూరు మధ్య గుంటూరు- గుంతకల్ మార్గాల

మిగతా 6లో...



బీపీఎస్ కోసం ఎదురుచూపులు

- అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణపై ఆశలు
- గత వైసీపీ హయాంలో నిలుపుదల
- ఈ ప్రభుత్వం స్పందిస్తే రూ.వందల కోట్ల ఆదాయం
- స్కీమ్‌తో పట్టణాల అభివృద్ధికి నిధులు లభ్యం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమించి నిర్మించిన కట్టడాలను క్రమబద్ధీకరించుకునేందుకు వేల దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2014-18 వరకు ఈ పథకం అమలు కాగా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అక్రమ కట్టడాలు, అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణను నిలిపివేసింది. దీంతో వందల సంఖ్యలో అక్రమ లేఅవుట్లు, వేలసంఖ్యలో అనధికార భవనాలు పెండింగ్‌లో పడిపోయాయి. తాజాగా కూటమి ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)ను పునఃప్రారంభించగా, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్, మునిసిపల్ అధికారులు పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. అయితే ఎల్ఆర్ఎస్‌పై రియల్టర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఫలితాలు సాధ్యపడటం లేదు. అయితే అనధికార నిర్మాణాలు నిర్మించుకుని బ్యాంకు రుణం పొందలేకపోవడంతో పలువురు గృహ యజమానులు ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించే బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్(బీపీఎస్) పథకం కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం జీవో

మిగతా 6లో...

వైద్యంపై దృష్టి

- సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు
- క్షేత్రస్థాయిలోనే మెరుగైన వైద్య పరీక్షలు
- ప్రభుత్వ వైద్యశాలల్లో బెడ్లు, మందులు సిద్ధం
- నాలుగు మండలాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువ
- వాటిపై వైద్యాధికారుల ప్రత్యేక కేంద్రీకరణ





ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభించడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల అడపాదడపా పడుతున్న వర్షాలతో గ్రామాలకు గ్రామాలు మంచాన పడుతున్నారు. ఒక్కొక్క గ్రామంలో అయితే పదుల సంఖ్యలోనే జ్వరపీడుతులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో వైద్యశాఖ అధికారులు ఆయా గ్రామాల్లో దృష్టి సారించారు. ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడమే కాకుండా వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే సాధారణ మందులతో పాటు యాంటిబయాటిక్ మందులు కూడా అందుబాటులో తీసుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు కొన్ని గ్రామాల్లో మురికినీరు కూడా నిల్వ చేరి దోమలు ఉత్పత్తి అవుతున్నట్లు వైద్యశాఖ గుర్తించింది. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌వో) ద్వారా క్షేత్ర స్థాయిలోనే అవసరమైన వైద్య పరీక్షలను కూడా నిర్వహిస్తున్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధులను ప్రాథమికంగా గుర్తించేందుకు వాటర్ ఎనాలిస్ కిట్స్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క ఎంఎల్‌హెచ్‌వో వద్ద పది కిట్లను అందుబాటులో ఉంచారు. ఎంఎల్‌హెచ్‌వోలు అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అందులో ఏమైనా జ్వరం ఉన్నట్లు అయితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు పంపే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో దర్శి, చీమకుర్తి, కనిగిరి, ముండ్లమూరు మండలాల్లో అధికంగా జ్వరపీడితుల కేసులు

మిగతా 6లో...

ఒక బార్‌కు లాటరీ

- మూడింటికి అప్లికేషన్లు నిల్

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిగిలిపోయిన నాలుగు బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా ఒంగోలులో ఒక దానికి నిబంధనల ప్రకారం నాలుగు అప్లికేషన్లు వచ్చాయి. దీంతో లాటరీ నిర్వహించి లైసెన్సీని ఎంపిక చేశారు. గురువారం ప్రకాశం భవన్‌లో డీఆర్వో కార్యాలయంలో నిర్వహించిన బార్ల లాటరీలో నలుగురు దరఖాస్తుదారులు పాల్గొన్నారు. లాటరీ ద్వారా ఎంపికైన దరఖాస్తుదారునికి బార్ దక్కింది. ఒంగోలులో రెండు బార్లు, మార్కాపురంలో రెండింటికి నోటిఫికేషన్‌లో దరఖాస్తులు కోరగా ఒంగోలులో ఒక్క బార్‌కు మాత్రమే నాలుగు అప్లికేషన్లు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్.ఆయేషాబేగం తెలిపారు. దీంతో డీఆర్వో ఓబులేసు సమక్షంలో లాటరీ తీసినట్లు తెలిపారు. ఇంకా జిల్లాలో మూడు బారులకు అప్లికేషన్లు రాకపోవడంతో మిగిలిపోయాయని తెలిపారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్

7

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.345

7

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దైవ దర్శనానికి శ్రీశైలం వెళ్తూ చట్టుతాండా వద్ద మోటారు సైకిలు వేగం అదుపు తప్పి కింద పడి నందికొట్కూరుకు చెందిన కే రాజేష్ బుధవారం గాయపడిన విషయం తెలిసిందే. కర్నూలు వైద్యశాలలో చికిత్సలు పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

నేటి నుంచి డయల్ యువర్ డీఎం

పొదిలి, సెప్టంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్‌రావుగురువారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు సమస్యలను తెలియజేవచ్చని సూచించారు.

21న సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఆదివార మధ్యాహ్నం 3గంటలకు సీనియర్స్ స్త్రీ, పురుషుల జట్టు ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షులు యనమల సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27, 28 తేదీలలో ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు సెల్ : 9381657774 ద్వారా సంప్రదించాలన్నారు.

మోటార్‌సైకిల్ పైనుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

- ఇద్దరికి స్వల్ప గాయాలు

కొండపి,సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు మోటార్‌సైకిల్‌పై వెళ్తూ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో తారురోడ్డుపై పడి గాయాల పాలైన ఘటన గురువారం మధ్యాహ్నం టంగుటూరు రోడ్డులోని రెస్టారెంట్ సమీపంలో జరిగింది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం మర్రిపూడి మండలం చిలంకూరు గ్రామానికి చెందిన ముగ్గురు ఇద్దరు యువకులు మధ్యలో ఓ యువతిని కూర్చోబెట్టుకుని వేగంగా కొండపి నుంచి టంగుటూరు వైపు వెళ్తున్నారు. ఇంతలో సమీప దూరంలో రోడ్డు పక్క నుంచి ఓ మోటార్ సైకిల్ వచ్చింది. దీంతో వేగంగా వెళ్తున్న మోటార్ సైకిల్ నడిపే వ్యక్తి సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తికి కాళ్లు, చేతులుపై చర్మం కోసుకుపోవడంతోపాటు తలకు తీవ్రమైన గాయం అయింది. మోటార్‌సైకిల్‌పై ఉన్న యువతికి, వెనుక ఉన్న యువకుడికి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. దీంతో గాయపడిన వ్యక్తికి వెనుక వున్న యువకుడు తన చొక్కా విప్పి తల గాయం నుంచి రక్తం కారకుండా అడ్డ పెట్టాడు. ఘటనను చూసిన కొందరు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించగా, వారు బాధితులు ముగ్గురిని కొండపి సీహెచ్‌సీకి తరలించారు.

ఎస్పీని కలిసిన మాగుంట



జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును సత్కరిస్తున్న ఎంపీమాగుంట

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్‌రాజును ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి స్థానిక ఎస్పీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్పీని శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

జీఎస్‌టీ సంస్కరణలతో దేశంలో ఆర్థిక విప్లవం

ప్రజల ఆర్థిక ప్రగతికి లాభదాయకం

వైద్య, వ్యవసాయ, విద్యా రంగాలకు ఊతం

అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ ఆర్థిక విప్లవానికి నూతన జీఎస్టీ సంస్కరణలు అద్భుతంగా దోహదపడతాయని, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశం సందర్భంగా ఆయన జీఎస్‌టీ నూతన సంస్కరణలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. నూతన సంస్కరణలతో ప్రజలు, పరిశ్రమలకు, ఆర్థిక ప్రగతికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయంతో ప్రజలకు పన్నుల భారం నుంచి వెసులుబాటు కలుగుతుందని చెప్పారు. వైద్యం, విద్య, వ్యవసాయం పరిశ్రమల రంగానికి ఊతం ఇచ్చిందన్నారు. 2017లో జీఎస్టీ విప్లవం మొదలైందని తెలిపారు. ఒక దేశం ఒకే పన్ను విధానం ద్వారా ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. 2018లో భారతదేశ జీఎస్‌టీ ఆదాయం రూ.7 లక్షల కోట్లు ఉంటే 2020 నాటికి రూ.12 లక్షల కోట్లు అయ్యిందని వివరించారు. ప్రస్తుతం జీఎస్‌టీ పరిధిలో కోటిన్నర మంది ఉన్నారన్నారు. తద్వారా ప్రభుత్వ మెరుగైన పన్ను విధానాన్ని అమలులోనికి తెచ్చిందన్నారు. క్యాన్సర్ జబ్బులకు వాడే మందులను జీరో ట్యాక్స్‌లోకి తీసుకు వచ్చారని ఇది చరిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. అత్యవసర మందులపై జీఎస్టీ పన్ను లేకుండా చేయడం హర్షింతగ్గ విషయమన్నారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజల చేతిలో సంపద పెరిగే వస్తువుల వినియోగం పెరుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుస్థిర నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడుల వరద వస్తోందన్నారు. అలాగే యువనేత నారా లోకేష్ ఏడాది కాలంలోనే 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించేలా కృషి చేస్తున్నారని చెప్పారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

దళితుల ఐక్యతతోనే రాజ్యాంగ పరిరక్షణ

మాజీ ఎంపీ చింతా మోహన్

టంగుటూరు(కొండపి), సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): దళితులు ఐక్యతతోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. గురువారం సాయంత్రం టంగుటూరులోని అంబేడ్కర్ నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అంబేడ్కర్‌నగర్‌లో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఆయన స్థానికులతో మాట్లాడారు. అనంతరం చింతామోహన్‌ను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు, రాష్ట్ర నాయకుడు చింతామణి, సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, రాష్ట్ర మాలల జేఏసీ నాయకుడు లాయర్ బాల నారాయణ, మేడిద రవి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌నగర్‌లో ర్యాలీగా వెళ్తున్న చింతా మోహన్, నాయకులు

బీపీఎస్ కోసం ఎదురుచూపులు

(5వపేజీ తరువాయి)

విడుదల చేస్తే తమ భవనాలను రెగ్యులరైజ్ చేసుకునేందుకు జిల్లావ్యాప్తంగా రెండువేల నుంచి మూడు వేలకుపైగా దరఖాస్తుదారులు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం త్వరితగతిన బీపీఎస్ పథకం జీవో విడుదల చేస్తే అటు భవనాల క్రమబద్ధీకరణతోపాటు జిల్లాలోని మునిసిపాలిటీలు, ఒంగోలు కార్పొరేషన్‌కు రూ.100 కోట్లుకుపైగా ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఆరేళ్లుగా ఎదురుచూపులు..

అక్రమ లేఅవుట్‌లతోపాటు అందులో నిర్మించే భవనాల క్రమబద్ధీకరణ కోసం ప్రజలు ఆరేళ్లుగా ఎదురు చూస్తున్నారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల ఆదాయ వనరుల పెంపుతో ఆయా పట్టణాలు, నగరాల అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరతాయని భావించిన టీడీపీ ప్రభుత్వం గతంలో ఈ స్కీమ్‌ను ప్రారంభించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా నిలిపివేయడంతో మధ్యతరగతి, ఆపై వర్గాల ప్రజలంతా ఆశతో ఎదురుచూస్తున్నారు. కొంతమంది ఇప్పటికే నిర్మాణాలు పూర్తిచేసుకుని వుండగా, మరికొందరు తమ పాత భవనాలను ఆధునికరించుకోలేక అవస్థలు పడుతున్నారు. పదిశాతంలోపు అతిక్రమించి నిర్మించిన భవనాలకు రెగ్యులర్ చేసుకోలేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం బీపీఎస్ పథకం పునఃప్రారంభిస్తే తమ భవనాలను క్రమబద్ధీకరించుకోవడం కోసం అనేకమంది ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో రూ.100 కోట్లపైనే ఆదాయం

భవన నిర్మాణాలు క్రమబద్ధీకరణతో ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, పొదిలి, చీమకుర్తి, దర్శి మునిసిపాలిటీలలో నిర్మాణాలు పూర్తయి, నిబంధనలు అతిక్రమంచిన భవంతులు 2,500కుపైగా భవనాలు క్రమబద్ధీకరణ కానున్నాయి. దాని ద్వారా జిల్లాలోని ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌కు సుమారు రూ.100 కోట్లపైనే ఆదాయం వచ్చే అవకాశం ఉందని పురపాలక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బీపీఎస్ ద్వారా వచ్చే ఆదాయం ప్రత్యక్షంగా కార్పొరేషన్, మునిసిపాలిటీల ఖజానాకు చేరి, నిధుల సౌలభ్యం ఉంటుందని వారు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పురపాలకశాఖ అనేక సంస్కరణలు తెరపైకి తీసుకువచ్చింది. ఇందులో ముఖ్యంగా స్థానిక సంస్థల ఆదాయం స్థానికంగానే ఖర్చు చేసుకోవచ్చని నిర్ణయించారు. దీంతో బీపీఎస్ ద్వారా పట్టణాలు, నగరాల అభివృద్ధికి ఈ నిధులు ఎంతో ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయి.

వైద్యంపై దృష్టి

(5వపేజీ తరువాయి)

నమోదు అవుతుండటంతో ఆయా మండలాల్లో ప్రత్యేకదృష్టి సారించారు. ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు కూడా పంపిణీ చేశారు. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాలుగు బెడ్లు ఉండగా అవసరమైతే సీజనల్ వ్యాధిగ్రస్తుల కోసం అదనంగా బెడ్లు వేస్తున్నారు. అన్ని వైద్యశాలల్లో సాధారణ మందులో పాటు యాంటిబయాటిక్ మందులతో పాటు సెలైన్ బాటిళ్లను కూడా అందుబాటులో ఉంచారు. మరో వైపు క్షేత్రస్థాయిలోని వైద్య సిబ్బంది ప్రజలకు దోమల బారి నుంచి ఉపశమనం పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో ఇంట్లో, బయట నీరు నిల్వ లేకుండా చేసుకోవడం ద్వారా దోమలను నివారించే విధంగా చర్యలు తీసుకున్నారు.

నిరంతరం ప్రజలకు వైద్య సేవలు

- డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

జిల్లాలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు నిరంతరం వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే అనేక గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి జ్వరాలను అరికట్టడం జరిగింది. ఇంకా ఎక్కడైనా అనుమానితులు ఉంటే వైద్య పరీక్షలునిర్వహించి తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత సీజనల్‌లో సాధారణంగా జ్వరాలు వస్తుంటాయని, అందువల్ల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా తమ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో జ్వరాలు అందుబాటులోనే ఉన్నాయని, అయినా ప్రభుత్వ ఆదేశాలతో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వ్యాధులను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పారదర్శకత.. జవాబుదారీతనం

(5వపేజీ తరువాయి)

సంబంధించిన ఆధారాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని కోరారు. సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ ఉన్న నేపథ్యంలో మీడియాలో వైరలయ్యే సమాచారంలో వాస్తవమెంతో బయటపెట్టే విధంగా చర్యలు ఉండాలని తెలిపారు. డయల్ 112, శక్తి కాల్‌సెంటర్‌కు వచ్చే ఫోన్లకు అత్యంత వేగంగా స్పందించాలని, బాధితులకు భరోసా కల్పించాలని సూచించారు.ఏఎస్పీనాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, సాయిఈశ్వర్ యశ్వంత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీసు కంట్రోల్ రూమ్, ఐటీకోర్ సెంటర్ పరిశీలన

పోలీసు కంట్రోల్ రూమ్, ఐటీ కోర్‌సెంటర్‌ను ఎస్పీ వి.హర్షవర్ధనరాజు గురువారం సాయంత్రం పరిశీలించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు. సీసీటీఎన్ఎస్, సీడీఆర్, సైబర్ క్రైమ్‌కు సంబంధించిన తాజా మార్పులు, అప్లికేషన్లు గురించి అడిగి తెలుసుకున్నారు. సాంకేతికత వినియోగంపై సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరు మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఐటీకోర్ టీమ్ సీఐ సూర్యనారాయణ ఉన్నారు.

డీఎస్సీ నియామకాల ప్రక్రియ వాయిదా

(5వపేజీ తరువాయి)

పాఠశాలల్లో 661 మంది ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోస్టులకు 188 మంది ఎంపికయ్యారు. జిల్లా నుంచి 849 మంది అభ్యర్థులు టీచర్ పోస్టులకు ఎంపికయ్యారు. ఈనెల 849 మంది అభ్యర్థులకు తోడుగా ఒక్కొక్కరు చొప్పున మొత్తం 1700 మందికిపైగా అభ్యర్థులు, వారి బంధువులను ఈ కార్యక్రమానికి తరలించేందుకు 43 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం సమాచారం రావడంతో ఏర్పాట్లను నిలిపివేసినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

అందరికీ ఫోన్లు, మెసేజ్‌లు

డీఎస్సీ నియామక పత్రాల జారీకి హాజరయ్యేందుకు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఒంగోలు చేరుకోవాలని బుధవారమే మెసేజ్‌లు, ఫోన్లు చేసి సిద్ధం చేశారు. ఏమేం సర్టిఫికెట్లు తేవాలో కూడా తెలియజేశారు. ఈ మేరకు అభ్యర్థులతో ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపులకు మెసేజ్‌లు కూడా పెట్టారు. వాయిదా విషయం తెలియగానే బస్సుల ఇన్‌చార్జులు మళ్లీ అభ్యర్థులకు ఫోన్లు చేసి, వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెట్టి వాయిదా విషయం తెలిపారు. గురువారం ఎవరూ ఒంగోలు రావద్దని కూడా తెలియజేశారు.

ఒంగోలు-దొనకొండ రైల్వే లైనుపై కదలిక

(5వపేజీ తరువాయి)

అనుసంధానంగా భావించగా ప్రస్తుతం మరో మార్గం కూడా ఇందులో కలవనుంది.

కొలిక్కి వచ్చిన నడికుడి-శ్రీకాళహస్తి లైన్

ఎన్నో దశాబ్దాలుగా జిల్లా ప్రజానీకం ఎదురు చూస్తున్న నడికుడి -శ్రీకాళహస్తి రైల్వేలైను కొలిక్కి వస్తోంది. జిల్లా పరిధిలో ప్రధానమైన దర్శి, పొదిలి, కనిగిరి ప్రాంతాల్లో రైల్వే మార్గం, స్టేషన్లు పూర్తితో పాటు ఇప్పటికే డెమో రైళ్లను కూడా నడిపారు. ఒంగోలు-దొనకొండ రైల్వేలైన్‌ను నిర్మిస్తే ఆ మార్గం కూడా దీనితో అనుసంధానం అవుతుంది. పొదిలి జంక్షన్‌గా ఇది కలవనుంది. ఆ రకంగా జిల్లాలో తూర్పు, పశ్చిమ మధ్య ప్రాంతాల గుండా సాగే కీలకమైన మూడు రైల్వే మార్గాలు దీని ద్వారా అనుసంధానం జరిగి ఆ మేర ప్రజలకు ఉపకరించనుంది. అయితే సమగ్ర రిపోర్టులు సకాలంలో రూపొందించినా వాటిని కేంద్రం ఆమోదించడం, నిధులు ఇచ్చి పనులు చేపట్టడం వంటివి ఎప్పటికి అనేది స్థానిక నేతల ఒత్తిడి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద నిధుల అవకాశాలను బట్టి స్పష్టత వస్తాయి. అయితే మరుగునపడిపోయింది అనుకున్న ఒంగోలు-దొనకొండ రైల్వే మార్గం రాష్ట్రంలో డీపీఆర్‌లను సిద్ధం చేస్తున్న రైల్వే మార్గంలో ఉండటం పట్ల ప్రజల్లో మళ్లీ ఆశలు రేకెత్తుతున్నాయి.

నేటి నుంచి మండలస్థాయి ఆటల పోటీలు

పొన్నలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రారంభించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరావు గురువారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

మహిళల ఆరోగ్య రక్షణకు స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్

పొన్నలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించనున్న స్వస్థ్ నారీ - స్వశక్తి పరివార్ అభియాన్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీ వరకు మండలంలోని అన్ని విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్త్రీల ఆరోగ్యం, శ్రేయస్సు ఒక శక్తివంతమైన కుటుంబానికి పునాది అని, దీనివల్ల దేశ భవిష్యత్తు ఆరోగ్యవంతంగా, ప్రకాశవంతంగా ఉంటుందని తెలిపారు. ముందుగా 310 మంది పేషంట్లను డాక్టర్ పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మండల టీడీపీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, టీడీపీ సీనియర్ నాయకులు కర్ల కోటిరెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, పార్టీ నాయకులు మండవ మురళీమోహన్, జడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కొండపి, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): కంది, వరి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎం. రజనీకుమారి అన్నారు. గురువారం ఆమె అధికారులతో కలిసి పెట్లూరులో కంది పంటను పరిశీలించారు. అనంతరం సింగరాయకొండ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని కొండపి, సింగరాయకొండ, పొన్నలూరు, జరుగుమల్లి మండలాల వ్యవసాయ సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం పెట్లూరులో నిర్వహించారు.

బాలల హక్కులపై అవగాహన

సంతనూతలపాడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలలకు ఉన్న హక్కులు , సమస్యలను ఏవిధంగా ఎదుర్కోవాలో జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ సాధికారతాధికారిణి ఎస్.సువర్ణ అవగాహన కల్పించారు. మండలంలోని పేర్నమిట్ట జడ్పీహైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 6నుంచి 18 సంవత్సరాల వయసుగల పిల్లలకు అభివృద్ధిని, సాధికారతను, రక్షణను అందించడం ద్వారా బాల్యవివాహాలు అడ్డుకోవచ్చని తెలిపారు. బాలల హక్కులకు భంగం వాటిల్లితే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 112, 181, 100లకు సమాచారం ఇవ్వవచ్చని బాలబాలికలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షితమైన మందుల వినియోగం ఆరోగ్యకరం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సురక్షితమైన మందులు వాడటం వలన ఆరోగ్యం లభిస్తుందని, మందుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన జీవన విధానం అందించవచ్చని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా గురువారం జీజీహెచ్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ నిర్ధారిత మందులు వాడకంతో పాటు అనవసరమైన మందుల వాడకం తగ్గించేలా కృషి చేయాలన్నారు. జీజీహెచ్‌కు విచ్చేసే రోగులకు మందుల వాడకంపై విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపతిరెడ్డి, ఫార్మసీ కాలేజీ హెచ్‌వోడీ డాక్టర్ చంద్రకళ, ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ డాక్టర్ అజయ్, క్విస్ కాలేజి ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదను తయారు చేయాలి : డీపీవో

అవీఇవీ



చెత్త నిర్వహణను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

కొండపి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించి సంపదను సృష్టించాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. గురువారం ఉదయం మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో చెత్త సేకరణను, నిర్వహణను, సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీని డీపీవో పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రజలకు ఆయన సేకరించిన చెత్తను వేరు చేయడంపై అవగాహన కలిగించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు, తాగునీటి సరఫరాపై అధికారులను, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీవో కార్యాలయం అధికారి చక్రధర్, ఎంపీడీవో రామాంజనేయులు, ఈవోఆర్డీ అంజలీదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి పుష్పలత, గ్రామ టీడీపీ నాయకుడు గుండవనేని రామ్మూర్తి నాయుడు, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

శతక పద్య పోటీ విజేతలకు జ్ఞాపికలు



గెలుపొందిన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

పంగులూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు ఉన్నత పాఠశాలలో గురువారం మూడు విభాగాలలో మండల స్థాయి శతక పద్యపోటీలు నిర్వహించారు. ప్రాథమికస్థాయిలో రిబిల్ షాన్ (పంగులూరు), డోలాంజలి(కోటపాడు), ప్రాథమికోన్నతస్థాయిలో నిఖిత (కోటపాడు), శ్రేష్ఠ(పంగులూరు), ఉన్నత పాఠశాల స్థాయిలో మమత (రేణంగివరం), కీర్తన(పంగులూరు) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. గెలుపొందిన బాలబాలికలకు ఎంఈవో వీరాంజనేయులు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అజిత్ ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ, హెచ్ఎంలు వడ్లమూడి వేణుబాబు, గుర్రం లక్ష్మీప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్టూరులో భారీ వర్షం



మార్టూరులో పెద్ద ఖానా వద్ద వర్షపునీరు

మార్టూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మధ్యాహ్నం దాదాపుగా గంటసేపు భారీ వర్షం కురిసింది. మార్టూరు బొలావల్లి, కోలలపూడి తాటివారిపాలెం, కోనంకి, వలపర్ల గ్రామాలలో భారీగా వర్షం కురిసింది. దీంతో టోల్‌ప్లాజా సమీపంలోని పొలాల్లో భారీగా వర్షపు నీళ్లు నిలిచాయి. అదేవిధంగా మార్టూరులో పెద్ద ఖానా వద్ద వర్షపునీళ్లు నిలిచాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అయితే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో జాతీయ రహదారి వెంబడి వర్షపు నీరు వెళ్లే విధంగా పనులు చేపట్టారు. దీంతో కొంతమేర సర్వీసు రోడ్డులో నీళ్లు నిలబడకుండా వెళ్లడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. వర్షంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

మార్టూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి బి.హనుమంతనాయక్ మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గుచూపితే ఉద్యానశాఖ ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. రైతులు పంట సాగు చేపడితే మంచి ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి భాషా, గ్రామ వ్యవసాయసహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

చెత్త రహిత అద్దంకిగా మార్చేందుకు సహకరించాలి



గరటయ్య కాలనీ వద్ద చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు

అద్దంకి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): చెత్తరహిత అద్దంకిగా మార్చేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గరటయ్య కాలనీ వద్ద చెత్త సేకరణ, అద్దంకి కొండ వద్ద డంపింగ్ యార్డులో చెత్తను శుద్ధి చేస్తున్న ప్రాంతాలను చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ రవీంద్రలు గురువారం పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులతో వ్యర్థాల తొలగింపు

టంగుటూరు/కొండపి, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు నుంచి రాగాయికుంటకు పోయే దారిలో మందుబాబులు పొలాల్లో మద్యంతాగి వ్యర్థాలను వదిలివేసి పొలాలను చెడగొడుతున్నారు. ఈ నేపథ్యంలో టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు ప్రత్యేక నిఘా ఉంచి మందుబాబులను, ఆకతాయిలను గుర్తించి గురువారం రాత్రి మందుబాబులతో పొలాల్లోని వ్యర్థాలను వారితో తొలగింపచేశారు. వ్యర్థాలను మందుబాబులతో కాల్పించారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. పదేపదే ఇటువంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని వారిని హెచ్చరించారు. పొలాల్లో మద్యం తాగి వ్యర్థాలను పడేసే వారిపై చర్యలు తీసుకున్నందుకు స్థానికులు, పొలాల రైతులు ఎస్సైను అభినందిస్తున్నారు.



వ్యర్థాలను మందుబాబులతో తగులబెట్టిస్తున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు

వణికించిన వర్షం




కర్నూలురోడ్డులో మోకాటిలోతు వర్షపు నీటితో ఒకరికొకరు పట్టుకుని వెళుతున్న ప్రజలు

ఒంగోలులో రెండుసార్లు గట్టివాన
రహదారులన్నీ జలమయం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి నగరం జలమయమైంది. కొద్దిసేపు తెరిపిచ్చినా, సాయంత్రం నుంచి మళ్లీ కారుమబ్బులతో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలలో రోడ్లన్నీ జలమయం కాగా ప్రధాన రహదారుల్లో మోకాళ్ల లోతున నీరు నిలబడి చెరువులను తలపించాయి. వర్షపునీరు, మరోవైపు పొంగిన మురుగుతో ప్రజలకు పాట్లు తప్పలేదు. ఏకధాటిగా కురిసిన వర్షానికి బాగ్యనగర్‌లో పలు వీధుల్లో నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాలలో వర్షపు నీరుపోయే మార్గం లేకపోవడంతో పరిస్థితి మరింత జటిలమైంది. బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, ఆర్టీసీ డిపో ఆవరణ, ఏకలవ్యనగర్, మసాన్‌దర్గా సెంటర్, బాగ్యనగర్ సమీపంలోని బధిరుల ఆశ్రమ పాఠశాల వద్ద నీరు నీరు నిలిచింది. వర్షంతోపాటు ఈదురు గాలులు వీయడంతో వీధుల్లో జన సంచారం మందగించింది. ఇదిలా ఉండగా పీవీఆర్ మైదానం చెరువును తలపించింది.

చిరువ్యాపారులకు తప్పని తిప్పలు

ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు చిరు వ్యాపారులు రోడ్లపై అంతంత మాత్రంగానే కనిపించగా, కూరగాయాలు, పళ్ల అమ్ముకునే వారిని తీరని నష్టం ఏర్పడింది. కొందరు వ్యాపారులు జోరున కురుస్తున్న వానలో సైతం అలాగే రోడ్డుపై కూర్చుని అమ్మకాలు సాగించగా, మరికొందరు వర్షంలో తడుస్తూనే వ్యాపారాలు సాగించారు.



ఆర్టీసీ బస్టాండ్ ఎదురులో...



కొప్పోలు రోడ్డులో నిలిచిన నీటిలో వెళుతున్న ప్రజలు



కొత్తమార్కెట్ వద్ద మురుగునీటిలోనే వెళుతున్నమహిళలు

పంటల ఎదుగుదలకు వర్షం దోహదం



ఎర్రగొండపాలెంలో ఏపుగా పెరుగుతున్న అరటితోట

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో గురువారం కురిసిన వర్షంతో పంటలకు దోహదపడుతుందని ఇటీవల నాట్లు వేసిన ఒంటి మొక్క మిరపనాట్లకు, అరటి, బొప్పాయి, బత్తాయి పండ్లతోటలకు, మొక్కజొన్న, పత్తి తోటలకు, కంది, పెసరకు ఈ వాన దోహద పడుతుందని రైతులు అంటున్నారు. పండ్ల తోటల సాగు రైతులు ఊరట చెందారు.

పొగాకు సాగు నియంత్రణకు చర్యలు

- నారుమడులను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు



నారుమడులను పరిశీలిస్తున్న బోర్డు విజిలెన్స్ అధికారులు

కొండపి, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగు నియంత్రణలో భాగంగా పొగాకు నారుమడుల దశ నుంచి పొగాకు బోర్డు అధికారులు నియంత్రణ కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా పొగాకు బోర్డు విజిలెన్స్ ప్రాంతీయ అధికారి ఎం.సత్యశ్రీనివాస్ గురువారం జరుగుమల్లి మండలంలోని పైడిపాడు, చతుకుపాడు, కామేపల్లి గ్రామాల్లోని వాణిజ్య నారుమడులను పరిశీలించారు. ఈసందర్భంగా వాణిజ్య పద్ధతిలో నారుమడులు పెంచే యజమానులు తప్పనిసరిగా బోర్డు రిజిస్ట్రేషన్ పొందాలని సూచించారు. నారు మడుల యజమానులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతోపాటు విత్తనాలు, విత్తిన తేదీ, ఇతర వివరాలను నారుమడి వద్ద బోర్డుపై ప్రదర్శించాలని నిర్వాహకులకు సూచించారు. బోర్డు నిబంధనలను పాటించని నారు మడుల యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారి సత్య శ్రీనివాస్ తెలిపారు.

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

-ఆర్‌డీడీ మధుకుమార్



మాట్లాడుతున్న ఆర్డీడీ మధుకుమార్

చీమకుర్తి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా వేసిన ప్లాట్లను, లేఅవుట్లను వెంటనే క్రమబద్ధీకరించుకోవటం ద్వారా సంపూర్ణ హక్కులు పొందవచ్చని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ మధుకుమార్ కోరారు. చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో లేఅవుట్ యజమానులు,డెవలపర్లతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. అక్రమ లేఅవుట్లలో ఉన్న ప్లాట్లకు భవననిర్మాణ అనుమతులు ఇవ్వమని,మౌలిక వసతులు కల్పించబోమని ఆయన తెలిపారు.పట్టణ పరిధిలో ఉన్న 27 అక్రమ లేఅవుట్ యజమానులు వెంటనే క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. అక్టోబరు 24వ తేదీ తుదిగడువుగా నిర్ణయించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీఏ పవన్‌కుమార్, కమిషనర్ రామకృష్ణయ్య,టీపీవో శారద పాల్గొన్నారు.

12 ఏళ్ల పెండింగ్ కూలిని ఇప్పించిన తహసీల్దార్



చెక్కు అందజేస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పన్నెండేళ్లుగా బకాయి పడిన కూలి డబ్బులు ఎట్టకేలకు బాధితుడికి అందాయి. తహసీల్దార్ కార్యాలయంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో తన కూలి డబ్బుల బకాయిని యజమాని వద్ద నుంచి ఇప్పించాలని తిరుగుతున్న తమ్మిశెట్టి పెద్దన్న దంపతులకు రెండు లక్షల పదివేల ఐదువందల ఐదు రూపాయల చెక్కును తహసీల్దార్ చిరంజీవి గురువారం తన కార్యాలయంలో బాధితుడికి అందజేశారు. మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి పెద్దన్న, తన తండ్రి పెద్ద పిచ్చయ్య ఎస్టేట్‌లోని వేముల ప్రసాద్, వేముల సుబ్బారావు పలకల ఫ్యాక్టరీలో 2000 సంవత్సరం మే 4 నుంచి 2002 సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీ వరకు పనిచేశారు. అప్పటి నుంచి బకాయి పడిన కూలిని యజమాని వద్ద నుంచి తహసీల్దార్ ఇప్పించారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.345

ఒంగోలు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పొగాకు వేలంకేంద్రం 2లో గురువారం జరిగిన వేలంలో పొగాకు కేజీ గరిష్ఠ ధర 345 రూపాయలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. కనిష్ఠ ధర కేజీ 103 రూపాయలు పలికింది. వేలానికి మొత్తం 884 బేళ్లు రాగా 679 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 151 బేళ్లు నోబిడ్ అయ్యాయి.

భూ ఆక్రమణ ఫిర్యాదుపై విచారణ



భూ ఆక్రమణపై విచారణ చేస్తున్న డీఆర్వో ఓబులేశ్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలోని హైదరీ క్లబ్ నిర్వాహకులు విలువైన వైద్య విధాన పరిషత్‌కు చెందిన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారని చేసిన ఫిర్యాదులపై జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేశ్ విచారణ చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో ప్రజా సంఘాల నాయకులు, రెవెన్యూ అధికారులతో పాటు ఫిర్యాదుదారులైన ప్రజాసంఘాల నాయకులతో ఈ విచారణ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు డీఆర్వో దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కమర్షియల్ (వ్యాపార) కాంప్లెక్స్‌ను నిర్మించారన్నారు. ఈ నిర్మాణానికి సంబంధించి ప్లాన్ అనుమతి కోరినా ఇవ్వలేదని డీఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన డీఆర్వో అందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. హైదరీ క్లబ్‌కు నోటీసులు ఇచ్చి ఫిర్యాదుచేసిన ప్రజాసంఘాల వారి సమక్షంలో సర్వే చేసి వారం రోజుల్లో నివేదికను అందజేయాలని ఒంగోలు అర్బన్ తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఒంగోలు నగర పాలక సంస్థ ప్లానింగ్ అధికారిని డీఆర్వో ఆదేశించారు. సర్వే పూర్తి చేసి నివేదిక ఇచ్చేంత వరకు అక్కడ కమర్షియల్ భవనాలను ప్రారంభోత్సవాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా ప్రజాసంఘాల నాయకులు కోరారు. లేనిపక్షంలో న్యాయం జరిగే వరకు దశల వారీగా పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ధరణికోట లక్ష్మీనారాయణ, పేరయ్య, ఎం. జార్జి, పేరం సత్యం, కొంగర నరసింహం, గుంటూరు మస్తాన్, లక్ష్మీ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

టైరు పేలి కారు బోల్తా.. నలుగురికి గాయాలు



టైరు పగిలి బోల్తా పడిన కారు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కారు టైరు పగిలి అదుపు తప్పి బోల్తా పడిన ఘటన స్థానిక ఈద్గావద్ద గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నరసరావుపేటకు చెందిన శివరామయ్య, భార్య పద్మ, కుమారుడు రేవంత్, కుమార్తె రోహిణికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శివరామయ్య కుటుంబ సభ్యులతో కారులో శ్రీశైలం దైవదర్శనం కోసం వెళ్తుండగా ఈద్గా వద్ద టైరు పగిలి వేగం అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పారిశ్రామిక భూములను పరిశీలించిన జేసీ

పామూరు, తర్లుపాడు మండలాల్లో సాగిన పర్యటన

నిమ్జ్, బయోగ్యాస్ ప్లాంట్‌లకు కేటాయించిన భూముల వివరాలపై ఆరా

త్వరగా క్లియరెన్స్ ఇవ్వాలని అధికారులకు ఆదేశం



నిమ్జ్ భూముల రికార్డులను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పామూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండాపురంలో పరిశ్రమల ఏర్పాటుకు సేకరించిన(నిమ్జ్) ప్రభుత్వ భూములను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. గతంలో నిమ్జ్ కోసం 12 వేల ఎకరాల ప్రభుత్వ భూములు సేకరించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో నిమ్జ్ ప్రాజెక్టు కోసం ఏపీఐఐసీ అభ్యర్థన ప్రకారం 856.67 ఎకరాల భూములకు సంబంధించి రికార్డులను పరిశీలించి అడ్వాన్స్ పొజిషన్ ఇవ్వాలని జేసీ ఆదేశించారు. ఈసందర్భంగా జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ నిమ్జ్ భూముల్లో పలు సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీకి దరఖాస్తు చేసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుయితే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావంగా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఆర్ఐ ఎస్.అజయ్‌కుమార్, వీఆర్వో ఎస్‌కే రఫీ, ఏపీఐఐసీ జిల్లా మేనేజర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ల భూముల పరిశీలన

మార్కాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు కోసం గుర్తించిన భూములను జేసీ గోపాలకృష్ణ గురువారం పరిశీలించారు. తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు, మంగళకుంట గ్రామాల్లో ఇప్పటికే కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు కోసం భూములను గుర్తించారు. కలుజువ్వలపాడు గ్రామంలో సర్వే నెంబర్ 86/4లో 150 ఎకరాలు, మంగళకుంట గ్రామంలో సర్వే నెంబర్ 195/3, 4, 5 సర్వే నెంబర్లలో 583 ఎకరాలను లీజు పద్ధతిలో కంపెనీకి అప్పగించనున్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే స్థానిక అధికారులు అన్ని రికార్డులు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. రెండు గ్రామాల్లో భూములను పరిశీలించిన జేసీ మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలో బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. త్వరలోనే భూములను రిలయన్స్ కంపెనీకి అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, తర్లుపాడు తహసీల్దార్ కె.కె.కిషోర్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



చిన్నకంభంలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

కంభం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు నియోజకవర్గంలోని 6 మండలాలలో పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులందరూ త్వరితగతిన నిర్మించుకోవాలని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన నియోజకవర్గంలోని ఆరు మండలాల లేఅవుట్లను ఆయన సందర్శించారు. లబ్ధిదారులతో కలిసి వివిధ నిర్మాణ దశలలో ఉన్న గృహాలను వేగవంతం చేసేలా చైతన్యపరిచారు. కంభం మండలంలోని చిన్న కంభం, లేఅవుట్, కొమరోలు మండలంలోని రాజుపాలెం లేఅవుట్, గిద్దలూరులోని నరవ లేఅవుట్‌లను పరిశీలించారు. అనంతరం ఆరు మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో సమీక్షించారు. సకాలంలో లబ్ధిదారులకు సిమెంట్, ఇనుము, ఇసుక పంపిణీ చేయాలని ఆదేశించారు. డిసెంబరులోగా అన్ని గృహాలను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మార్చి తర్వాత నిధులు ఆగిపోతాయని, ప్రస్తుతం పీఎంఏవై 1.0 కింద గృహాలను పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట మార్కాపురం ఈఈ పవన్ కుమార్, గిద్దలూరు డీఈ ఖాదర్‌బాషా, కంభం ఎంపీడీవో వీరభద్రాచారి, 6 మండలాల ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



త్రిపురాంతకం బస్టాండ్ తీరు ఇదీ

కూర్చోలేరు - నిలబడలేరు

పేరుకు మాత్రమే అది ఆర్టీసీ బస్టాండ్. కానీ ఎలాంటి వసతులూ లేవు. జాతీయ రహదారి వెళ్తున్న త్రిపురాంతకంలో ఉన్న బస్టాండ్ దుస్థితి ఇది. నిత్యం విజయవాడ, కర్నూలు, శ్రీశైలం వైపు వెళ్లే పలు డిపోల ఆర్టీసీ బస్‌లు ఇక్కడ్నుంచే వెళ్తుంటాయి. బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు బల్లలు లేవు. ఒకవేళ నిల్చుందామనుకున్న వారికి దుర్గంధం తప్ప సేదదీరే అవకాశమే లేదు. బస్టాండ్ ఆవరణలో మురుగునీరు నిల్వ ఉండటం, వర్షం వస్తేచాలు చెరువును తలపించేలా నీరు నిలవటం చెత్త, మురుగు కలిసి ఉంటుంది. ఎన్నో ఏళ్లుగా ఈ బస్టాండ్ ఇలానే ఉంటున్నా ఏ ఒక్కరూ దీనిపై స్పందించలేదు. గతంలో ఇదే బస్టాండ్ పరిసరాల్లో భోజనానికి, టిఫనీలకు బస్సులు నిలిపేవారు. ఇప్పుడు ఇక్కడ నెలకొన్న పరిస్థితులు దృష్ట్యా బస్సులు నిలిపేందుకు సాహసించటం లేదు. - త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి

20న గురుకులంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిల్లంపల్లి పంచాయతీ గిరిజన గురుకుల పాఠశాల మైదానంలో ఈ నెల 20వ తేదీన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అడక్ కమిటీ ప్రెసిడెంట్ పీ రామచంద్రరావు, సెక్రటరీ ఎం.వెంకటరెడ్డి గురువారం తెలిపారు. అండర్ 14, 16, 18 నుంచి 20 సంవత్సరాల లోపు యువతీ, యువకులు పాల్గొనవచ్చునని తెలిపారు. ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక చేస్తారని తెలిపారు. ఆసక్తి గల యువత 10వ తరగతి మార్క్‌లిస్టు, జనన ధ్రువీకరణ, ఆధార్, రెండు ఫొటోలు, రూ.300 ఎంట్రీ ఫీజుతో 20వ తేదీ ఉదయం 8 గంటలలోపు హాజరు కావాలని కోరారు. వివరాలకు 7675026220, 9908169358 సంప్రదించాలన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ 4,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సివస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్యామ్, ఒంగోలు నగర అధ్యక్షుడు వి. కోటి, నాయకులు కే చంద్రశేఖర్, సుభాని, తేజ, పవన్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మెప్మా పీడీ శ్రీహరి, హాజరైన వ్యాపారులు

వీధి వ్యాపారులకు 'లోక కల్యాణ మేళా' వరం

● మెప్మా పీడీ శ్రీహరి

చీమకుర్తి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): వీధివ్యాపారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన లోక కల్యాణ మేళా పథకం వరం లాంటిదని మెప్మా పీడీ శ్రీహరి తెలిపారు. చీమకుర్తి పట్టణంలో గురువారం వీధివ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.మూడు విడతలలో బ్యాంకుల ద్వారా అందించే రుణాల ద్వారా వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు.కమిషనర్ రామకృష్ణయ్య మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు వీధివ్యాపారులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, మహిళా అధ్యక్షురాలు శివపార్వతి,కంది మళ్ల గంగాధరరావు, రాణి, రూపలక్ష్మి, శివశంకర్, బ్యాంకర్లు పాల్గొన్నారు.



తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారీ విధానాన్ని వివరిస్తున్న అంగన్‌వాడీలు

పోషకాహారంపై అవగాహన

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు, తిమ్మసముద్రం, పోతవరం ప్రభుత్వ వైద్యశాలల వద్ద మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. చక్కెర సంబంధ ఆహారం, వంటనూనెలు ఎక్కువ మోతాదులో తీసుకోవడం ద్వారా వచ్చే అనారోగ్య సమస్యలను వివరించారు.తక్కువ ఖర్చుతో ఆకుకూరలు, చిరుధాన్యాలతో మంచి పోషకాహారం తయారు చేసుకొనే విధానాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉష, ప్రమీల, అన్నపూర్ణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులను చూపుతున్న విద్యార్థులు

పేస్ విద్యార్థులకు బహుమతులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కావలి విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో పాల్గొని బహుమతులు సాధించారు. పి. జ్యోత్స్న, ఎం. అనిల్‌కుమార్, జి. సాయి అశుతోషిలు తమ ప్రతిభను చాటి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా గురువారం పేస్ కళాశాలలో నిర్వహించిన సభలో విజేతలను అభినందించారు. కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి సదస్సుల్లో పాల్గొనడం ద్వారా పోటీతత్వాన్ని, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, డీన్‌లు సీవీ సుబ్బారావు, ఆర్. వీరాంజనేయులు, ఏవో ఎంపీ రమణ, హెచ్‌వోడీ మేరీ ఉన్నారు.

నృత్యపోటీల్లో శ్రీగురుదత్త విద్యార్థినుల ప్రతిభ

ఒంగోలు విద్య, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని శ్రీ గురుదత్త హైస్కూలులో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు నృత్యపోటీల్లో తమ ప్రతిభను చాటారు.



విద్యార్థినులను అభినందిస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

ఒంగోలు జేసీఐ నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల నృత్య పోటీల్లో శ్రీ గురుదత్త హైస్కూలు విద్యార్థినులు భాను బృందం పాశ్చాత్య నృత్య పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. బహుమతి సాధించిన విద్యార్థినులను చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు అభినందించారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్లూరి సీతారాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణ, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులు పొగాకు సాగును తగ్గించుకోవాలి

ఒంగోలు వేలం రెండో కేంద్రం నిర్వహణాధికారి తులసి

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): చైనా, బ్రెజిల్ వంటి దేశాలలో పొగాకు పంట ఉత్పత్తి పెరిగినందున భారతదేశం నుంచి ఎగుమతులు తగ్గేపరిస్థితులు ఉన్నాయని, రైతులు పొగాకు సాగును తగ్గించుకోవాలని ఒంగోలు పొగాకు రెండో వేలం కేంద్రం నిర్వహణాధికారి జె.తులసి స్పష్టం చేశారు. వేలం కేంద్రంలో పొగాకు పంట నియంత్రణ - ప్రత్యామ్నాయపంటలు అనే అంశంపై పొగాకు రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వేలంకేంద్ర అధికారి మాట్లాడుతూ 2024-2025 సంవత్సరానికి సంబంధించి పొగాకు సాగు అధికంగా చేయడంతో ఉత్పత్తి పెరిగి ధరలు లేక పోయిన విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే సీజన్‌లో రైతులు తీవ్రనష్టాలు చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు.



ఒంగోలు పొగాకు వేలంకేంద్రం రెండులో రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి తులసి

రైతులు ఇప్పుడు ఉన్న పరిస్థితులు తెలుసు కొని పొగాకు పంటసాగును తగ్గించుకోవాలని, ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు.

పొగాకు పంట సాగు చేసే రైతులు తప్పక నారుకొనుగోలు రశీదును నారు అమ్మకాలు చేసేవారి నుంచి పొందాలన్నారు. అలాగే రైతులు బ్యారన్ల లీజులు, భూముల లీజ్‌లు అధిక ధరలకు తీసుకోవద్దని వివరించారు. ఈకార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ వెంకటేశ్, జీపీఐ మేనేజర్ కిషోర్, పీఎస్ఎస్ మేనేజర్ ఆదిత్య, పొగాకు రైతులు, బోర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎస్‌బీఐ ఎన్నో వినూత్న పథకాలను అమలు చేస్తున్నదని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు అన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా జిల్లారీజనల్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక టౌన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాదారుల హక్కుల పరిరక్షణకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. వాట్సాప్ ద్వారా బ్యాంకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబరు ద్వారా బ్యాంకింగ్‌సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ అందుబాటులోకి తేవడంతోపాటు ఎప్పటికప్పుడు ఖాతాదారులనుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని సేవలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐ గుంటూరు పరిపాలనా కార్యాలయ చీఫ్ మేనేజర్ సంజీవ్ కుమార్ బన్సల్ ఖాతాదారుల హక్కులు, బ్యాంక్ అందిస్తున్న సేవలు,సైబర్ మోసాల నుంచి ఎలా రక్షణ పొందాలి వంటి అంశాలను వివరించారు. ఖాతాదారులకు బ్యాంకు అందజేస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. మరణించిన వారి ఖాతాలకు సంబంధించి నామినీలు ఎక్కడైనా అవసరమైన పత్రాలు సమర్పించే అవకాశం కల్పించామన్నారు. ఇటువంటి ఖాతాల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. డెబిట్, క్రెడిట్ కార్డు మోసాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం శ్రీనివాసరావు

ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు కే రవికుమార్, వేదం రాజేష్‌బాబు, కే హారతి, హెచ్‌ఆర్ మేనేజర్ నళినికాంత్, కే జానకి రామయ్య, అసోసియేషన్ నాయకులు వి. శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, అవార్డు యూనియన్ నాయకులు సుధాకర్, పి.వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

నిరుద్యోగం మిగిల్చిన బీజేపీ పాలన

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శ

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వాగ్దానాలను బీజేపీ తుంగలో తొక్కిందని కేంద్రమాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ విమర్శించారు. గురువారం స్థానిక యంసీఏ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర వైఫల్యాలను ఎండగట్టారు. 11 ఏళ్ల క్రితం నిరుద్యోగం నిర్మూలనతో పాటు ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు ఇస్తామని బాకా ఊదిన బీజేపీ ఇప్పటివరకు నయా పైసాకూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. దేశంలో నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఉద్యోగాలు లేక డిగ్రీలు చదివిన వారు పారిశుధ్య కార్మికులుగా జీవనం గడుపుతున్నారని అన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

అదే విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నారని, వర్గీకరణ వలనే రాష్ట్రం రెండుగా విడిపోయిందని అన్నారు. అంతే కాదు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ప్రకారం 75 ఏళ్లు నిండిన వారు ప్రధాని పదవికి అర్హులు కారని, మరి మోడీకి నిన్ననే 75 ఏళ్లు నిండాయని అయననుప్రధాని పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు విజేంద్ర బహుజన్, పీకా మధుసూధనరావు, మన్నం ప్రసన్న రాజు లు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబానికి బలం

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బలంగా ఉంటుందని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడులోని ప్రభుత్వ వైద్యశాల వద్ద గురువారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో లభించే ఆకుకూరలు, చిరుధాన్యాలతో తయారుచేసుకొనే ఆహారంతో లభించే పోషకాలను వివరిస్తూ ఏర్పాటుచేసిన పోషణ స్టాల్‌ను డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్లడ్‌బ్యాంక్ వైద్యులు వినీల, ప్రియాంక, బీజేపీ నాయకులు లచ్చంశెట్టి టిగ్రా, స్థానిక హెల్త్‌సూపర్‌వైజర్ శౌరయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

మహిళలకు వైద్య పరీక్షలు

కొత్తపట్నం : స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కొత్తపట్నం, ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలకు పెద్దఎత్తున వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరాలను మండల అభివృద్ధి అధికారి శేషుబాబు ప్రారంభించారు. కొత్తపట్నంలో జరిగిన వైద్యశిబిరంలో ఒంగోలు మాతాశిశు వైద్యశాల గైనకాలజిస్టు డాక్టర్ హారిక, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రావ్య, ఈతముక్కలలో వైద్యాధికారిణి డాక్టర్ నవ్యారెడ్డి మహిళలకు పరీక్షలు నిర్వహించారు.

త్రోవగుంటలో ప్రత్యేక వైద్యశిబిరం

బాలికలు, స్త్రీలు మంచి బలవర్ధకమైన పోషక ఆహారం తీసుకోవాలని త్రోవగుంట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్‌సమీర్ అన్నారు. స్థానిక అర్బన్ హెల్త్‌సెంటర్‌లో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సమీర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. త్రోవగుంట జడ్పీ ఉన్నతపాఠశాల బాలికలకు ప్రత్యేక వైద్యపరీక్షలతోపాటు గ్రామమహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరిత, డాక్టర్ లియో, డాక్టర్ మాధురి, డాక్టర్ రంగాకుమార్ వైద్య సేవలు అందించారు.

మహిళల ఆరోగ్యం కోసమే..

సంతనూతలపాడు : మహిళల ఆరోగ్యం కోసమే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమమని ఎం.వేములపాడు పీహెచ్‌సీ, సంతనూతలపాడు పీహెచ్‌సీ వైద్యులు బి.సుధారాణి, బి. కమల, నాగరాజులు అన్నారు.

గురువారం ఎం.వేములపాడు పీహెచ్‌సీలో మెడికల్ క్యాంపు నిర్వహించి 520 మందికి వైద్య పరీక్షలు, అలాగే సంతనూతలపాడు పీహెచ్‌సీ పరిధిలోని 250 మందికి వైద్యపరీక్షలు, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

జంక్ ఫుడ్స్ వినియోగాన్ని తగ్గించుకోవాలి

కొండపి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అందరూ జంక్ ఫుడ్స్ వినియోగాన్ని తగ్గించుకోవాలని సీడీపీవో బి. సుశీలాదేవి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు, స్థానికులకు అవగాహన కలిగించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వయస్సుతో నిమిత్తం లేకుండా అందరికీ బీపీ, చక్కెర వ్యాధులు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ఉప్పు, చక్కెర, నూనెల వాడకాన్ని తగ్గించుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు.

అనాథలకు ఆహారం అందజేత

టంగుటూరుకు చెందిన యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అనాథలకు భోజనం, వాటర్‌బాటిల్స్, ఆహారాన్ని గురువారం అందజేశారు. జమ్ములపాలెం గ్రామానికి చెందిన పూనాటి వెంకటేశ్వర్లు మనుమడు బొంతు సిద్ధార్థ పుట్టిన రోజు సందర్భంగా ఆర్గనైజేషన్‌వారు కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థ సభ్యులను దాత వెంకటేశ్వర్లు ప్రశంసించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు దేవరపల్లి చంద్రశేఖర్, పొదిలి శశికుమార్, గరికముక్కుల మూర్తి, ఇత్తడి వినయ్ పాల్గొన్నారు.

యాప్‌ల తయారీపై విద్యార్థులకు వర్క్‌షాపు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో అధునాతన టెక్నాలజీలపై విద్యార్థులకు గురువారం వర్క్‌షాపును నిర్వహించారు. సీఎస్‌ఈ ఆర్టిఫిషియల్‌ఇంటలిజెన్సీ మెషిన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్) విద్యార్థులకు యాప్‌ల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఇండస్ట్రీ నిపుణులు ప్రియాన్స్ శుక్లా యాప్‌ల తయారీపై ప్రత్యేక ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్ సుందర్ విద్యార్థులకు డీవోపీ ప్యాటన్ ఇన్ యాక్షన్ స్ట్రాటజీ అండ్ సింగిల్ టన్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా క్విస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రిలు మాట్లాడుతూ విద్యార్థులకు సరికొత్త టెక్నాలజీలపై శిక్షణ ఇప్పించడంలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ముందుంటుందని తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాన్ని డాక్టర్‌ప్రవీణ్, శివ ప్రసాద్, విజయలక్ష్మి, రాయుడులు నిర్వహించారు.

బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన వర్గాలపై దాడులు జరగకుండా అడ్డుకునేందుకు గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా నేటికి బీసీల రక్షణ చట్టం ఏర్పాటు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. 50 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికీ పింఛన్ హామీని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అందుకోసం త్వరలో విజయవాడలో నిరసన కార్యక్రమాన్ని చేపడతామన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం బీసీ కులాల జేఏసీ ముందుండి పనిచేస్తుందని ఆయన తెలిపారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

సంతనూతలపాడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరాబ్యాంకులోని ఖాతాదారులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ రెన్యూవల్ చేయించుకోవాలని కెనరా బ్యాంకు బెంగళూరు చీఫ్ జనరల్ మేనేజర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో డ్వాక్రా మహిళలకు ఏర్పాటుచేసిన గ్రామ స్థాయి జనసురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీవనజ్యోతి, జీవనసురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్‌లను వినియోగించుకోవాలన్నారు. డ్వాక్రా మహిళలందరూ బ్యాంకు ఖాతాలను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కెనరాబ్యాంకు సిబ్బంది, జిల్లా రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, డ్వాక్రాసిబ్బంది, వెలుగు ఏపీఎం బాబూరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఈవోఆర్డీ రమణమ్మకు సత్కారం

సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఈవోఆర్డీగా పనిచేస్తున్న రమణమ్మ నెల్లూరు రూరల్‌కు ఎంపీడీవోగావెళ్తున్నారు.ఈ సందర్భంగా గురువారం ఆమెను మండలపరిషత్ సిబ్బంది, మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, జడ్పీటీసీ డి.రమణమ్మ, ఎంపీపీ బి.విజయ, సర్పంచ్ నాగమణి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలి

● మండల సమావేశంలో ఎంపీపీ శ్రీనివాసరావు

చీమకుర్తి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు కోరారు. మండల సర్వసభ్యసమావేశం గురువారం ఎంపీపీ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. శాఖల వారీ సమీక్షలు నిర్వహించారు. కూనంనేనివారిపాలెంలో తాగునీటి సరఫరాపై అధికారులు దృష్టిసారించాలని ఎంపీటీసీ వేమా అశ్విని కోరారు.తమ గ్రామంలో బోర్లు వేయాలని పులికొండ ఎంపీటీసీ లక్ష్మయ్య కోరారు. ముప్పావారిపాలెం ప్రాథమికపాఠశాలలో వర్షం కురిస్తే ఉరుస్తుందని ఎంపీటీసీ సమావేశం దృష్టికి తేగా తాము పాఠశాలను సందర్శించి మరమ్మతులకు ఆదేశాలు ఇస్తామని ఎంపీపీ తెలిపారు.అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి మండల నిధులు మంజూరు చేస్తామని తెలిపినా సంబంధిత అధికారులు శాఖాపరమైన అనుమతులు మంజూరు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం పట్ల శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండపరిషత్ నిధులు రూ.24కోట్ల రూపాయలతో పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి నిర్వహించనున్న పనులకు త్వరలోనే రూట్ క్లియర్ అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో ఎంపీడీవో రామేంద్ర, తహసీల్దార్ బ్రహ్మయ్యఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నాటక ప్రదర్శన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

అంబేడ్కర్ నాటకాన్ని విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామిని అంబేడ్కర్ నాటకాన్ని ఈనెల 20వతేదీన ఒంగోలు నగర పరిధిలోని పేర్నమిట్ట శాంతినగర్‌లో నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురాం తెలిపారు. పేర్నమిట్టలో గురువారం నాటకం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ దృశ్యం ద్వారా అందరికీ మరింత చేరువ చేసే ప్రయత్నం కేవీపీఎస్ చేస్తుందన్నారు. ఈనెల 20న జరిగే అంబేడ్కర్ నాటకాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నెరుసుల వెంకటేశ్వర్లు, బంకా సుబ్బారావు, టి. సుబ్బారావు, జూపూడి వీరనారాయణ, జార్జి, అజయ్, సుమన్, యానిది తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

ఎమ్మెల్యే బీఎన్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీఎన్‌విజయ్‌కుమార్ పుట్టినరోజు ఈనెల 21న(ఆదివారం) సందర్భంగా నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కందుకూరిబాబు, పలువురు టీడీపీ నేతలు గురువారం ఒంగోలులో ఆయన కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యే బీఎన్‌కు ముందస్తు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీ బోల్తా

● డ్రైవర్‌పై 6ఎ కేసు నమోదు

మద్దిపాడు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుండ్లాపల్లి వద్ద రేషన్ బియ్యం లారీ అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటన గురువారం జరిగింది. దీనిపై లారీ డ్రైవర్ కోటేశ్వరరావుపై ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ కృష్ణమోహన్ 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



షెడ్, చిల్లర బంకును ఢీకొని బోల్తా పడిన రేషన్ బియ్యం లారీ

లారీ బోల్తాకొట్టడంతో ఇటుకల షెడ్, చిల్లర వ్యాపారం చేసే వ్యక్తి బంకు, విద్యుత్ స్తంభం దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. రేషన్ బియ్యం 1200 బస్తాలను గోడౌన్‌కు తరలించినట్లు డీటీ కృష్ణమోహన్ తెలిపారు.


పోలేరమ్మకు పొంగళ్లను తీసుకెళ్తున్న మహిళలు

వైభవంగా పోలేరమ్మ జాతర

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దరిమడుగు గ్రామంలో గురువారం మహాలయ పక్షం సందర్భంగా పోలేరమ్మ తల్లికి జాతరను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ బండి కట్టి వీధుల్లో తీన్‌మార్ సౌండ్స్‌తో ఉత్సాహంగా యువకులు, మహిళలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు నివేదించారు. కార్యక్రమంలో మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇల్లాలి ఆరోగ్యంతోనే అభివృద్ధి

రాచర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇల్లాలి ఆరోగ్యంతోనే కుటుంబ అభివృద్ధి అని టీడీపీ యువనాయకుడు అంబవరం శ్రీనివాసరెడ్డి అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ (ఇల్లాలి ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యం) కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరో గ్య శాఖ వారు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను గురువారం ఆయన అనుములవీడు ప్రాథమిక వైద్యశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన మహిళలు శక్తివంతమై న కుటుంబానికి సారథులన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ కే రమేష్, సిబ్బంది రంగనాయకులు, జి రమేష్, ఎం ప్రసాద్, రవీంద్రారెడ్డి, వీరకుమారి, షమీం లక్ష్మీ, శివరామకృష్ణ, క్రాంతి కుమార్, స్థానిక సర్పంచ్ పల్నాటి లతీఫ్ పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మహిళల ఆరోగ్యంతోనే కుటుంబం అభివృద్ధి చెందుతుందని డాక్టర్ కనకదుర్గ తెలిపారు. మండలంలోని తిప్పాయపాలెం పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ రోహిత్ నాయక్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బండి లక్ష్మీదేవి, వైద్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.


పెద్దారవీడులో ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పొదిలి : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైద్యాధికారి శరత్‌చంద్ర అన్నారు. గురువారం ప్రభుత్వ వైద్యశాలలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు.గర్భిణులకు డాక్టర్ శివపార్వతి పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి విజయలక్ష్మి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అనిల్, ఏఎంసీ చైర్మన్ డాక్టర్ ఇమామ్‌సా, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, పట్టణ అధ్యక్షుడు కు ద్దూష్, కాటూరి శ్రీను పాల్గొన్నారు.

పెద్దారవీడు : మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని డాక్టర్ జగదీష్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మహిళలకు రక్త పరీక్షలు నిర్వహించారు. తోలుతత గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు గాయత్రీ గర్భిణులకు, కుసుమ దంత సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో జాఫర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరినాథ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : గొట్లగట్టు గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలలో మెడికల్‌క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నరేంద్రకుమార్, ఎస్‌పీ బాలయ్య మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో పీసీ నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సులు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కొమరోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరగనున్న క్రీడలను ఎంపీపీ అమూల్య, సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి గురువారం ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వాలీబాల్‌ను ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు కామూరి శ్రీనివాసరెడ్డి, పాఠశాల చైర్మన్ షేక్ సుభాని పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఎంఈవోలు పీ అంజనేయులు, మల్లునాయక్ అన్నారు. గురువారం మండలంలోని బోయలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. ఎంఈవోలు, గ్రామ సర్పంచ్ కోటయ్య, హెచ్‌ఎం హెమ్లానాయక్, ఉపాధ్యాయులు క్రీడలు ఆడి వారిని ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో పీడీలు మత్తయి, రాజు, వెంకటేశ్వర్లు, నిహారిక, ఉపాధ్యాయులు గాలయ్య, యేసా నాయక్ పాల్గొన్నారు.

రాచర్ల : రాచర్ల ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్, సెలక్షన్ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జడ్పీహెచ్‌ఎస్‌లో రెండోరోజు ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రెండోరోజు ఖోఖో, కబడ్డీ, రన్నింగ్, షాట్‌పుట్ గేమ్స్ అండర్ 14/17 బాలబాలికలకు జరిగాయి.


బోయలపల్లిలో విద్యార్థులతో ఆటలు ఆడుతున్న ఎంఈవో

ఇందులో ఖోఖో, కబడ్డీ టీమ్స్ సెలెక్ట్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గేమ్స్‌లో పాల్గొనే విద్యార్థులకు భోజనంతోపాటు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్, ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ కె రాము, పీఈటీలు విజయ, పి శ్రీనివాసులు, ఎన్‌సీసీ కేవీ రమణారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోగా సత్యం

కొమరోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవోగా ఎస్. సత్యంను నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సత్యం ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న దాత నాగిరెడ్డి, టీడీపీ నాయకులు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను గ్రామస్థుడు పోతిరెడ్డి నాగిరెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు పోతిరెడ్డి రంగారెడ్డి, ఆదెమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జాకబ్, ఉపాధ్యాయులు రవి, సురేఖ, టీచర్ రామక్రిష్ణారెడ్డి, దాత పోతిరెడ్డి నాగిరెడ్డి కుంటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దారవీడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు ప్రభుత్వం అందజేసే సౌకర్యాలను సద్వినియోగం చేస్తుకోవాలని ఎంఈవో ఎస్‌వీసీహెచ్ సుబ్రమణ్యాం అన్నారు. మండల వనరుల కేంద్రంలో గురువారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సీపీ చైర్లు, ట్రై సైకిళ్లు, ఎల్బో క్రస్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సుబ్రమణ్యాం మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు ప్రతి గురువారం ఐఆర్‌టీ సెంటర్‌లో వైద్యుల పర్యవేక్షణలో ఫిజియోథెరపీ చేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, మాజీఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, సిబ్బంది బాలవద్దిరాజు, జహీర్, సిబ్బంది పాల్గొన్నారు.


బాలికలను అభినందిస్తున్న టీచర్లు

జిల్లా స్థాయిలో ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికలను అభినందించిన హెచ్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ కౌశింటీ, శివ వసంత ప్రథమ స్థానాలు పొంది జిల్లా విద్యాశాఖ అధికారులతో బహుమతులు అందుకున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి

రాచర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయానికి రైతులు మొగ్గు చూపాలని ఏవో మహబూబ్ బాషా అన్నారు. ఆత్మ ప్రకాశం ఆధ్వర్యంలో జేపీ చెరువు గ్రామం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్పు, స్ప్రింకర్ ఇరిగేషన్ సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 73 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వాసుబాబు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వాసుబాబు అన్నారు. ప్రభుత్వ ఐటీఐలో గురువారం వివిధ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించారు. 93 మంది అభ్యర్థులు పాల్గొనగా 73 మంది అభ్యర్థులకు వివిధ కంపెనీలలో రూ.21,400 వేతనంతో కూడిన నియమాకపత్రాలను అందించినట్లు తెలిపారు.


ఆర్టీసీ సిబ్బందిని సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆదర్శ ఉద్యోగులకు సన్మానం

గిద్దలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఆదర్శ ఉద్యోగులను మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు సన్మానించారు. ఆర్టీసీ డిపోలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో గత నెలలో సంస్థకు అత్యధిక ఆదాయాన్ని సంపాదించి పెట్టిన సిబ్బందిని కమిషనర్ రమణబాబు సన్మానించి అభినందించారు. ప్రత్యేక ప్రతిభావంతులు, వయోవృద్ధుల కోసం అమృత అనుపత్రి సమకూర్చిన వీల్‌చైర్‌ను బస్టాండ్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిపో మేనేజర్ షేక్ మౌనిక, యూనియన్ నాయకులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జూలై నెలలో జరిగిన 6 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం అనేక హామీలు ఒప్పందం చేసుకున్నదని, హామీలను అమలు చేయాలని ఆవులయ్య కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.చంటయ్య, పావయ్య, డి.రంగయ్య, ప్రవీన్‌కుమార్, కన్నయ్య, మధు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, చెన్నకేశవులు, ఇమాంసా, కనకయ్య పాల్గొన్నారు.

పొదిలి : మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేఉయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి బండి కోటేశ్వరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు గురువారం ధర్నా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు సుబ్బయ్య కేవీ నరసింహం, నాగేశ్వరావు, కోటేశ్వరమ్మ, నాగరత్నం పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం మద్యం తాగుతున్న ప్రదేశాలతోపాటు నిర్మానుష ప్రదేశాలపై నిఘా ఉంటుందని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే మందుబాబులపై కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ కె.సురేష్ హెచ్చరించారు. గురువారం పలు ప్రాంతాలలో ఏఎస్సై జిలాని, పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. నిత్యం మద్యం సేవించేందుకు అడ్డాలుగా ఏర్పరచుకున్న కొన్ని ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. వెంటనే మున్సిపల్ కార్మికులతో ఆ ప్రదేశాలలో పగులగొట్టి పారవేసిన గాజు ముక్కలను శుభ్రం చేయించారు. సీఐ మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసు స్టేషన్‌కు బ్రీత్ అనలైజర్ అందజేత

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్బన్ పోలీసుస్టేషన్‌కు లారీ ఓనర్స్ అసోసియేషన్ రూ.40వేలు విలువ చేసే బ్రీత్ అనలైజర్‌ను అర్బన్ సీఐ కె.సురేష్‌కు గురువారం అందచేశారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తించడానికి తమ వంతు సహాయంగా బ్రీత్ అనలైజర్ కిట్‌ను అందిస్తున్నట్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ సెక్రటరీ షేక్ రఫి అన్నారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ వారిని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సయ్యద్ బాషా, తలారి రాజశేఖర్, శ్రీనివాసచౌదరి పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల వ్యాధులపై అప్రమత్తం


గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న ఏడీఏ రమేష్

తర్లుపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలు, మేకలు, పశువులకు వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు సీహెచ్ రమేశ్ అన్నారు. మండలంలోని మంగళకుంటలో గొర్రెలు, మేకల రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పోషకులు జాగ్రత్తలు తీసరోవాలని సూచించారు. అనంతరం జీవాలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో తాడివారిపల్లె పశు వైద్యాధికారి విష్ణువర్ధన్ రెడ్డి, వీఏ త్రినాథ్‌రెడ్డి, సిబ్బంది పుణ్యవతి, రైతులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలను ఏర్పాటు చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో ఉర్దూ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య అన్నారు. స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో గురువారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రయ్య మాట్లాడుతూ.. మార్కాపురంలో ముస్లిం జనాభా ఎక్కువ ఉన్నందున ఉర్దూ ఉన్నత పాఠశాల అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

22 నుంచి సెలవులు ఇవ్వాలి

గిద్దలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవలను ఈనెల 21 నుంచి కాకుండా 22వ తేదీ నుంచి ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసులు, జిల్లా అదనపు కార్యదర్శి ఎస్.హెచ్.కబీర్, మండల శాఖ అధ్యక్షుడు బిదేవసహాయం ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నేడు జాబ్ మేళా

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ బాలికల ఉన్నత పాఠశాలలో జాబ్ మేళా శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి రవితేజ తెలిపారు. వివరాలకు ఫిరోజ్ గాంధీ 7013950097కు సంప్రదించాలని తెలిపారు.

మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని చందలూరులో జరిగిన స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహిళల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన జాతీయ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకానికి సీఎం చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేయించినట్లు చెప్పారు. ఈసందర్భంగా చందలూరులో మహిళలకు నిర్వహించిన వైద్యశిబిరంలో గుండె జబ్బులు, మధుమేహం, కాన్సర్, తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. పోషకాహారం తీసుకోవాల్సిన అవశ్యకతపై గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వైసురేఖ, డాక్టర్ వాణి, డాక్టర్ లక్ష్మీ పూజిత, డాక్టర్ కెవీ శ్రీనివాసులు, డాక్టర్ బ్లెస్సీ, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, జనసేన నాయకుడు పి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: కుటుంబంలోని మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం, సమాజం మరింత బలంగా ఉంటుందని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ముండ్లమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమాన్ని ప్రతి మహిళ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, జడ్పీటీసీ ఎల్.రత్నరాజు, సుంకర రామవరెడ్డి, పాలపర్తి సుబ్బారావు, సర్పంచ్ గోపనబోయిన వెంకటేశ్వరరావు, డాక్టర్ పోశం వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు ఎం.జాస్మిన్, జె.వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మహిళలు ఆరోగ్య వంతులుగా ఉంటే ఆ కుటుంబం, సమాజం సురక్షితంగా ఉంటుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. గురువారం తాళ్లూరు, తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మారం, డాక్టర్ ప్రవీణ్, సర్పంచ్ బార్లెస్ సర్తస్, వైస్ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, ఎంపీడీవో సానికొమ్ము సత్యం, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు: స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 326 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి రవితేజ మాట్లాడుతూ మహిళలకు 14 రకాల సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సుస్మితారెడ్డి, సర్పంచ్ క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో భారీ వర్షం

» రోడ్లపైకి చేరిన వర్షపు నీరు
» పొంగిపొర్లిన కాటేరు వాగు



ఉధృతంగా ప్రవహిస్తున్న కాటేరు వాగు

దర్శి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఎడతెరపి లేకుండా వర్షం పడటంతో రోడ్లు జలమయమయ్యాయి. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో వర్షపునీరు రోడ్లపై నిలబడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మురుగు కాల్వలు సక్రమంగా లేక పోవటంతో వర్షపునీరు రోడ్లపైకి చేరుతుంది. కాటేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ వాగు పూర్తిగా ఆక్రమణకు గురికావటంతో భారీ వర్షం కురిసినప్పుడు నీరు కిందకు వెళ్లే వీలులేక దర్శి-పొదిలి ప్రధాన రహదారిపైకి చేరుతుంది. సుమారు వంద ఎకరాల్లో ఉన్న వాగును ఇరువైపులా ఆక్రమించి కట్టడాలు నిర్మించటంతో చిన్న మురుగు కాల్వగా మారింది. భారీ వర్షానికి పొలాల్లో నీరు కాటేరువాగుకు రావటంతో ప్రతిసారీ ట్రాఫిక్ జామ్ అయి ప్రజలకు ఇబ్బంది కల్గుతుంది. అన్నిప్రాంతాల్లో విస్తారంగా వర్షం కురవటంతో మెట్ట ప్రాంతాల్లో రైతులకు ప్రయోజనం చేకూరింది.

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇటీవల కాలంలో విపరీతమైన ఎండలు కాస్తూ వరుణదేవుడి జాడలేకపోవటంతో రైతులు సాగు చేసిన పంటలు వాడుముఖం పట్టే స్థితికిచేరాయి. ప్రస్తుతం పంట పొలాల్లో నీళ్లు నిలిచేలా భారీ వర్షం కురవటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దర్శిలోని గడియారస్తంభం సెంటర్‌లో రోడ్డుపైకి చేరిన వర్షపు నీరు

ముండ్లమూరు: మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ముండ్లమూరు, పసుపుగల్లు, పెదఉల్లగల్లు, పులిపాడు, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ముండ్లమూరు పోలీసుస్టేషన్ ఎదురుగా వర్షపు నీరు నిలిచిపోయింది. గాలివాన బీభత్సానికి రెడ్డినగర్‌లో మూడు రేకుల షెడ్లు ధ్వంసమయ్యాయి. పులిపాడు తండాలో భూక్యా హనుమంతరావు నాయక్‌కు చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి.

కురిచేడు: కురిచేడులో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. మెట్ట పంటలకు ఈ వర్షం జీవం పోశాయి.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పామూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు అన్నారు. గురువారం మండలంలోని వగ్గంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవోలు పి.కోటిరెడ్డి, కె.కరుణకుమారి మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారిని నియోజకవర్గ, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికచేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డి. సుబ్బయ్య యాదవ్, టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, బైరెడ్డి జయరామిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, రెక్కల వెంకటరమణారెడ్డి, చావా సుబ్బారావు, పారా వెంకటేశ్వర్లు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, జె.చినసుబ్బయ్య, జనసేన జిల్లా కార్యదర్శి షైరహీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో అబ్దుల్ కరీం అన్నారు. గురువారం ముండ్లమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. గెలుపు, ఓటములను సమాన దృష్టితో చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో షేక్ కాలేషావలి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరరావు, హెచ్ఎం మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

కురిచేడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దర్శిలో నవంబరు 7,8,9 తేదీల్లో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సందు వెంకటేశ్వరరావు, గౌసియా, అంజలి, నాగమణి, అశోక్‌కుమార్, కేవీ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

కనిగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. ఇందుకోసం వివిధ పథకాలను అమలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని సాయిబాబా గుడివీధిలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ తిరుపతిరెడ్డి, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

పామూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళల సంపూర్ణ ఆరోగ్యంతోనే బలమైన కుటుంబాలు ఏర్పడతాయని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అక్టోబర్ 2 వరకు మండలంలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు షేక్ దాదా షరీఫ్, రుబియా, రవళి, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులిచ్చి సహకరించాలి



మంత్రి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో రోడ్ల అభివృద్ధికి నిధులిచ్చి సహకరించాలని రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కోరారు. గురువారం అమరావతిలో మంత్రిని కలిసి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పలుచోట్ల రోడ్లు మరమ్మతులకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర వివరించారు. కనిగిరి-కంభం రోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. నియోజకవర్గంలో పలుగ్రామాలకు వెళ్ళే ఆర్అండ్‌బి రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. ఈమేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కనిగిరి ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందించి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దర్శి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్శి- తూర్పుచౌటపాలెం రోడ్డులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మండలంలోని తూర్పుచౌటపాలెం గ్రామానికి చెందిన రాచపూడి ఏసురాజు(17), భాను, కార్తీక్‌లు దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నారు. కళాశాల ముగిసిన అనంతరం సాయంత్రం బైకుపై స్వగ్రామానికి బయలుదేరారు. ఆ సమయంలో భారీగా వర్షం కురుస్తుంది. ఈక్రమంలో దర్శి- తూర్పుచౌటపాలెం రోడ్డులో ఎదురుగావస్తున్న స్కూల్ బస్సు ఢీకొట్టడంతో ఏసురాజు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలైన రాచపూడి భాను, రాచపూడి కార్తీక్‌ను దర్శి ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

దర్శి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని 91 మందికి ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి రూ.48.32 లక్షలు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి, కురిచేడు, దొనకొండ, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, పిడతల నెమలయ్య, మోడి అంజనేయులు, వెంకటేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బొప్పాయి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రబాబు రైతులకు సూచించారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటచలంపల్లిలో గురువారం బొప్పాయి సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పీసీపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జరిగిన ఉల్లాస్ అక్షరాంధ్ర శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్వాక్రా గ్రూపులలో సభ్యులుగా ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో డీటీ ధర్మతేజ, ఏపీఎం సత్యానందం, శశిరేఖ, గీతమ్మ, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కురిచేడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించాలని టీడీపీ లీగల్‌సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. ఇందుకోసం విరివిగా మొక్కలు నాటాలన్నారు. చంద్రన్న పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గంగదొనకొండ గ్రామంలో మొక్కలు పంపిణీ చేశారు.

తృణధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

కనిగిరి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తృణధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ గురువాజీపేట సూపర్‌వైజర్ పార్వతమ్మ అన్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లల్లో పోషకాహారలోపం లేకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగార్జున, అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ సరస్వతి, ధనమ్మ, జ్యోతి, హెల్పర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో అక్రమాల నివారణకు చర్యలు

కనిగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆధునిక టెక్నాలజీతో అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ భూపతి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో గురువారం నియోజకవర్గంలోని రేషన్ డీలర్లకు నూతన ఈపోస్ మిషన్‌లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 217 రేషన్ పాయింట్ డీలర్లుకు వీటిని అందజేసినట్టట చెప్పారు.

గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

తాళ్లూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జేపీ శివారెడ్డి అన్నారు. గురువారం తాళ్లూరు శాఖా గ్రంథాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథపాలకురాలు వి.విజయకుమారి, బీడీసీఎల్ నిర్వహకురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

కురిచేడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీపీ జనరల్ పాఠశాలలో వంద మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇందూరి వెంకటనర్సిరెడ్డి ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు వస్రాం నాయక్, సుబ్బారావు, జేబీ రామారావు, వీపీ రమణారావు, వెంకటనరిసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ చోరీ

ముండ్లమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ పంచాయతీ పరిధిలో సోలార్ ప్లాంట్‌లో గుర్తు తెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. కేబుల్ వైర్, రాగి వైర్‌ను అపహరించడంతో ప్లాంట్ మేనేజర్ గురువారం సాయంత్రం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.లక్ష మేర కేబుల్ వైర్ చోరీకి గురైనట్లు తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

పామూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ఉచితంగా వ్యాధి నిరోధిక టీకాలు వేస్తుందని టీడీపీ గ్రామ అధ్యక్షుడు మార్నేని రామకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో వెటర్నరి అసిస్టెంట్ శ్రీవల్లి పశువులకు టీకాలు వేశారు.

స్త్రీనిధి రుణాలపై ప్రత్యేక బృందాలతో విచారణ

పామూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పామూరులో స్త్రీనిధి రుణాల రికవరీ అధ్వానంగా ఉందని జిల్లా స్త్రీనిధి మేనేజర్ ఉదయ్ అన్నారు. ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టి రికవరీ చేయనున్నట్లు చెప్పారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీవోఏల నిర్లక్ష్యంతో సుమారు కోటి రూపాయల వరకు బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. సక్రమంగా కట్టిన గ్రూపుల నగదును ఇతర గ్రూపుల్లోకి జమ చేయడంతో వారు అధిక వడ్డీలు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఒక తప్పును కవర్ చేయడానికి మరో తప్పు చేస్తున్నారని అన్నారు. నిధులు దారిమళ్లిఉంటే సంబంధిత వివరాలను సీసీలకు అందజేయాలన్నారు. రికార్డులపరంగా లోపాలు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టాలని సూచించారు. ఈనెలాఖరుకు 50 శాతం రుణాల రికవరీ చేయాలని ఆదేశించారు. అనంతరం వీవోఏలకు డివైజ్‌లు పంపిణీ చేశారు. సమావేశంలో స్త్రీనిధి నియోజకవర్గ మేనేజర్ సంపత్‌కుమార్, డీపీఎం షేక్ జిలాని, ఏపీఎం జి.విద్యాసాగర్, సీసీలు ఆర్.సరళ, వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.



పత్తి రైతుకు దన్ను



- కనీస మద్దతు ధర లభ్యం
- అందుబాటులోకి కపాస్ కిసాన్ యాప్
- దళారులకు అడ్డుకట్ట వేస్తూ సీసీఐ నిర్ణయం
- ఈ ఏడాది క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.8,110

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
ఆరుగాలం కష్టపడి తెల్లబంగారాన్ని పండించినా నష్టపోతోన్న రైతన్నకు దన్ను ఇచ్చేలా.. దళారుల దోపిడీని అరికట్టేలా.. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. పత్తి రైతులందరూ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పొందేందుకు వీలుగా 'కపాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లో నమోదు చేసుకుని రైతులు తాము పండించిన పత్తిని కనీస మద్దతు ధరకు నేరుగా విక్రయించేందుకు తొలిసారిగా ఈ యాప్‌ను సీసీఐ అందుబాటులోకి తెచ్చింది. రైతులకు మద్దతు ధర దక్కేలా చేయడమే ఉద్దేశంగా సీసీఐ ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధరకు పత్తిని విక్రయించే దళారీలకు అడ్డుకట్ట పడనున్నది. కనీస మద్దతు ధర పథకం కింద పత్తి సాగుదారులు ప్రయోజనాలను పొందడానికి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సీసీఐ అభ్యర్థిస్తోంది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీ ద్వారా లాగిన్ అవ్వాలి. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.8,110గా ప్రకటించింది. కనీస ధర పొందాలంటే యాప్‌లో ముందుగా రిజిస్టర్ అయిన రైతులు పత్తి విక్రయ సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఏ రోజు సీసీఐ కేంద్రంలో వారు పత్తి విక్రయించాలో వివరాలు తెలుపుతూ యాప్ సమాచారం ఇస్తుంది. ఇలా చేయడం వల్ల రోజుల తరబడి నిరీక్షించాల్సిన బాధ రైతులకు తప్పుతుంది. స్లాట్ బుక్ చేసుకున్న వారికే మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది. వేసవిలో సాగు చేసిన పత్తి మొదటి దశ కాపు పత్తి తీస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో వివిధ దశల్లో పత్తి సాగు ఉంది. అయితే యాప్ విధానం బాగున్నా అందరి వద్ద స్మార్ట్‌ఫోన్లు లేవని రైతులు చెబుతున్నారు. స్మార్ట్ మొబైల్ ఉన్న రైతులకు మాత్రమే ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఈ పరిస్థితుల్లో రైతులకు యాప్ వినియోగంపై వ్యవసాయశాఖ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది.


జీసీలో జరుగుతున్న మెరక పనులు

బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు

ముస్తాబవుతున్న సూర్యలంక తీరం

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బీచ్‌ఫెస్టివల్‌కు సూర్యలంక సముద్రతీరం ముస్తాబవుతోంది. ఈ నెల 26, 27, 28 తేదీల్లో బీచ్‌ఫెస్టివల్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తీరంలో విశాలమైన భూభాగాన్ని చదును చేశారు. మెరకలు నిమిత్తం మట్టిని తవ్వి గుంతలలో పోసి చదును చేస్తున్నారు. అటు సముద్రం దగ్గర నుంచి ఇటు మత్స్యకారుల నివాసాల వరకు, మరోవైపు ఆక్వాచెరువులకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి వరకు మొత్తాన్ని ఏకచదరం చేస్తున్నారు. బీచ్‌ఫెస్టివల్‌కు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా ఇవ్వడంతో పనులపై నిత్యం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ బీచ్‌ఫెస్టివల్‌ను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లను శరవేగంగా చేపడుతున్నారు. 27న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూర్యలంకబీచ్‌ని సందర్శించనున్నారు. రూ.97.52 కోట్లతో పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేసేందుకు కూడా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

బీచ్‌ఫెస్టివల్ వేడుకలకు తీరంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. వేడుకలకు ముఖ్యమంత్రి విచ్చేయుచున్న నేపథ్యంలో తీరంలో తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ గురువారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్, సీఎం కాన్వాయ్ ప్రయాణించే మార్గం, సభావేదిక, స్టాల్స్ ప్రదేశం, హెలీప్యాడ్, సూర్యలంక మెరైన్ పోలీసుస్టేషన్‌ను ఎస్పీ పరిశీలించారు. పార్కింగ్ ప్రాంతాన్ని సెక్టార్లుగా విభజించుకుని వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా మార్గాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఎస్పీ సూచించారు. తీరంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న 15మంది గజఈతగాళ్లతోపాటు అదనంగా మరికొంత మందిని నియమించుకోవాలన్నారు. నిర్దిష్ట లోతులో జెండాలు ఏర్పాటు చేసి అక్కడ పడవలలో పోలీసు సిబ్బంది, గజఈతగాళ్లతో గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ జి.రామాంజనేయులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


తీరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్, డీఎస్పీ జి.రామాంజనేయులు


ఎన్ఎంఎంఎస్‌కు శిక్షణ అందిస్తున్న ఉపాధ్యాయులు

ఉపకారం.. ప్రోత్సాహం

ఎన్ఎంఎంఎస్‌పై విద్యార్థులకు శిక్షణ • ఇప్పటికే జిల్లాలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు • అక్టోబరు 30 వరకు గడువు.. డిసెంబరు 7న పరీక్ష

చీరాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థికపరమైన సమస్యలతో విద్యార్థులు బడి మానేయకుండా వారికి ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కం మెరిట్(ఎన్ఎంఎంఎస్) ఉపకార వేతనాలు అందిస్తోంది. ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలతో ఎంతోమంది విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది. ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు నాలుగేళ్లు రూ.12 వేల చొప్పున విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఈ ఏడాదికి ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించి అక్టోబరు 30 వరకు దరఖాస్తులకు సమయం ఇవ్వగా జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేే ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు డిసెంబరు 7న పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయులు ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇస్తున్నారు.

అర్హత సాధించేలా శిక్షణ



ఎన్ఎంఎంఎస్ ప్రతిభ పరీక్షలో జిల్లాకు చెందిన విద్యార్థులు పెద్దసంఖ్యలో అర్హత సాధించేలా శిక్షణ ఇస్తున్నాము. ఇప్పటికే అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు సూచనలు కూడా చేశాము. శిక్షణకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవు తున్నారు. కొందరు ఉపాధ్యాయులు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి శిక్షణ ఇస్తున్నారు. - శ్రీరాం పురుషోత్తం, డీఈవో, బాపట్ల

అందుబాటులో 366 ఎంటీల యూరియా

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 366 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. రైతులు పంట వేసిన పొలాలకు పరిపడ యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా 2075 మంది రైతులకు 259.170 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ జరిగిందన్నారు.

మాచర్లకు రేపు ముఖ్యమంత్రి

మాచర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఈ నెల 20న మాచర్ల పట్టణంలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీశైలం రోడ్డులోని కస్తూర్బా పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఎస్‌కేబీఆర్ గ్రౌండ్‌లో బహిరంగ సభ వేదిక ఏర్పాట్లు జరుగుతున్నాయి. సెయింట్ ఆన్ స్కూల్ ఆవరణలో హెలిప్యాడ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగమంతా మాచర్లకు చేరుకుంది. శుక్రవారానికి ఏర్పాట్లు పూర్తి చేసేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టనున్నారు.

మరింత 'జనరల్'గా 'టిక్కెట్' బుకింగ్..!

- రైల్వే సిబ్బంది వీపు భాగాన క్యూఆర్ కోడ్
- స్కాన్ చేసి జనరల్ టిక్కెట్‌లు పొందొచ్చు
- పండగల రద్దీ దృష్ట్యా.. రైల్వే నిర్ణయం

గుంటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే పండుగల రద్దీ దృష్ట్యా జనరల్ టిక్కెట్ల బుకింగ్‌ను రైల్వే మరింత సులభతరం చేసింది. యూటీఎస్ యాప్ ద్వారా సులువుగా టికెట్ పొందేందుకు కొంతమంది రైల్వే సిబ్బంది ధరించిన దుస్తుల వీపు భాగాన క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను రైల్వే శాఖ అతికించింది. దీంతో ప్రయాణికులు రైల్వే స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ఎక్కడ ఉందా అనేది వెతుక్కోవాల్సిన అవసరం ఉండదు. సిబ్బంది ధరించిన జాకెట్ వెనక భాగాన ఉన్న క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసి, కాగిత రహిత టిక్కెట్‌ని బుకింగ్ చేసుకోవచ్చు. ఎలాంటి హడావుడి లేకుండా రైలులో ప్రయాణించవచ్చు. రద్దీ అధికంగా ఉండే గుంటూరు రైల్వేస్టేషన్‌లోనూ ఈ సదుపాయాన్ని ప్రయాణికులకు అందు బాటులోకి తీసుకొచ్చారు. సిబ్బంది ధరించిన రెట్రో రిఫ్లెక్టివ్ జాకెట్లు వెనుక వైపున మాత్రమే క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుంది. యూటీఎస్/రైల్‌వన్ యాప్‌ల ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, జనరల్ టిక్కెట్లను బుక్ చేసుకునేలా సౌకర్యం కల్పించింది. స్టేషన్ కాన్ కోర్స్ ప్రాంతంలో నియమించబడిన వ్యక్తులు ఈ జాకెట్లను ధరిస్తారు. యూటీఎస్, రైల్‌వన్ యాప్‌ల ద్వారా టిక్కెట్లను కొనుగోలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి సిబ్బంది వారికి మార్గనిర్దేశం చేస్తారు. ఈ ముఖాముఖీ విధానం వల్ల యాప్‌లు వినియోగదారు - స్నేహపూర్వక లక్షణాల గురించి, ముఖ్యంగా క్యూఆర్ కోడ్ ఆధారిత టికెటింగ్ గురించి ప్రయాణికులలో అవగాహన కల్పించడంలో సహాయపడుతుంది. ఇది టికెట్ కౌంటర్ల వద్ద క్యూలను తగ్గించడానికి, నగదు రహిత, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి సహాయపడుతుంది.


రెట్రో రిఫ్లెక్ట్ జాకెట్ వెనక వైపున అతికించిన క్యూఆర్ కోడ్

సులభంగా టిక్కెట్ బుకింగ్..

జనరల్ టిక్కెట్ల కొనుగోలు కోసం మొదట విధించిన దూర పరిమితులను రైల్వే శాఖ ఇప్పుడు సడలించింది. రైలు వినియోగదారులు ఇప్పుడు స్టేషన్ ప్రాంగణం /రైల్వే ట్రాక్ నుంచి 5 మీటర్ల దూరంలో ఉన్న ఏ ప్రదేశం నుంచైనా టిక్కెట్లను కొనుగోలు చేయవచ్చు. సరళంగా చెప్పాలంటే, ప్రయాణికుడు తమ ఇంటి నుంచే టిక్కెట్లను (జర్నీ/ప్లాట్‌ఫాం/సీజన్) బుక్ చేసుకోవచ్చు. ప్రయాణికులు ఆర్-వాలెట్, పేటీఎం, యూపీఐ/ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి వివిధ డిజిటల్ విధానాల ద్వారా చెల్లింపు చేయవచ్చు. ఆర్-వాలెట్ ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేసినప్పుడు 3 శాతం బోనస్ కూడా క్రెడిట్ చేయబడుతుంది.

బాపట్లలో రేపు జాబ్‌మేళా

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సాల్వేషన్ ఆర్మీ ఐటీఐ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.మాధవి తెలిపారు. జాబ్‌మేళాకు అరబిందో ల్యాబ్స్, ముత్తూట్ ఫైనాన్స్, రిలయన్స్ ట్రెండ్, వరుణ్ మోటార్స్ రాయల్ మెరైన్, టీవీఎస్, టాటా ఎలక్ట్రానిక్స్, ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్ కంపెనీలు హాజరై 500 మందికిపైగా నియామకాలు చేపడతాయన్నారు. విద్యార్హతను బట్టి రూ.12 వేలు నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుందన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమో, ఎంబీఏ చదువుకున్న 18నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు వచ్చేవారి వద్ద ఆధార్‌లింక్ అయిన మొబైల్ అందుబాటులో తప్పనిసరిగా ఉండాలన్నారు. వివరాలకు 9640695229 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేరస్తులపై కఠిన చర్యలు

- ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరిక
- పట్టణ, రూరల్, సర్కిల్ స్టేషన్లలో తనిఖీ

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. బాపట్ల పట్టణ, రూరల్, సర్కిల్ పోలీసు స్టేషన్లను గురువారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో పోలీసులకు పట్టుబడి పట్టణ పోలీసుస్టేషన్‌లో పాడైపోతున్న ద్విచక్రవాహనాలను పరిశీలించి దీర్ఘకాలంగా ఉన్న వాటిని డిస్పోజ్ చేయాలన్నారు. రూరల్ పోలీసుస్టేషన్‌లో ఉమెన్‌హెల్ప్‌డెస్క్‌ను సందర్శించి మహిళా కానిస్టేబుల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జి.రామాంజనేయులు, సీఐలు జి.నారాయణ, ఆర్.రాంబాబు, హరికృష్ణ, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


పట్టణ, రూరల్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లతో మాట్లాడుతున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బౌద్ధరామ అభివృద్ధికి కృషి

- భట్టిప్రోలు బౌద్ధక్షేత్ర సందర్శనలో ఎంపీ కృష్ణప్రసాద్

భట్టిప్రోలు(కొల్లూరు), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భట్టిప్రోలులోని బౌద్ధరామ క్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం గ్రామంలోని బౌద్ధస్థూపాన్ని సందర్శించిన ఎంపీ స్థూపం చుట్టూ ప్రదక్షిణ చేసి, పురావస్తుశాఖ ఏర్పాటు చేసిన లిపిని పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ 2014-19 మధ్య కాలంలో బౌద్ధస్థూపం అభివృద్ధి కొంత మేర జరిగిందన్నారు. అనంతరం ఏర్పడిన ప్రభుత్వం స్థూపం అభివృద్ధిపై చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి బౌద్ధ స్థూపం విషయాన్ని తీసుకు వెళ్లి గతంలో ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభింప చేస్తానన్నారు. ఇందుకు కేంద్ర నిధులను సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. తథాగతుని విగ్రహం, గ్రంథాలయం ఏర్పాటుతో పాటు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పర్యాటక కేంద్రంగా భట్టిప్రోలును తీర్చిదిద్దేందుకు అధికారులతో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, మండల ఉపాధ్యక్షుడు యడ్ల జయశీలరావు, నాయకులు దొక్కు శ్రీనివాసరావు, కొలుసు పోతురాజు, వై.పాండురంగారావు, పున్నారావు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధిపై నేతలతో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణప్రసాద్

అనధికారికంగా.. ఆక్వా

- వాన్‌పిక్ భూముల్లో రొయ్యల సాగు
- చెరువుల పక్కా రిజిస్ట్రేషన్ సాధ్యమేనా?
- నిబంధనల ఉల్లంఘన.. నమోదుకు అడ్డంకులు

బాపట్ల, ఆంధ్రజ్యోతి)
'ఆక్వా రంగం తీవ్రమైన ఒడిదుడుకుల్లో ఉంది. దానిని సంక్షోభం నుంచి బయటపడేయాలంటే ముందు చెరువుల రిజిస్ట్రేషన్ పక్కాగా జరగాలి.' అని ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు ఆక్వా సాగును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు. రొయ్యల సాగుకు సంబంధించి ప్రతీ ఎకరం రిజిస్ట్రేషన్ ద్వారా భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం సులభంగా ఉంటుందనేది ప్రభుత్వ ఆలోచన. అయితే జిల్లావ్యాప్తంగా అనధికారికంగా పెద్దఎత్తున ఆక్వా చెరువులు ఉన్నాయి. ఏళ్ల తరబడి నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల సాగు చేపడుతున్న వారి సంఖ్య గణనీయంగానే ఉంది. ముఖ్యంగా కోర్టు పరిధిలో ఉన్న వాన్‌పిక్ భూములను కూడా వదలకుండా వాటిని చెరువులుగా మార్చారు. అసైన్డ్ భూములు కూడా రొయ్యలు చెరువుల్లా మారాయి. నిజాంపట్నం మండల పరిధిలోని దిండి, కొత్తపాలెంతో పాటు చీరాల నియోజకవర్గంలో కూడా వేల ఎకరాలు వాన్‌పిక్‌కు కేటాయించిన దాదాపు 5,000 ఎకరాల్లో అనధికారికంగా రొయ్యల సాగు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలా చెరబట్టిన వాటిలో దాదాపు 80 శాతం రాజకీయ నేపథ్యం ఉన్నవారివే కావడంతో యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. వీటిని రిజిస్ట్రేషన్ చేయడానికి నిబంధనలు ఒప్పుకోవు. ఇక అసైన్డ్ భూముల విషయానికి వస్తే దాదాపు పదివేల ఎకరాలలో అడ్డగోలు రొయ్యల సాగు జరుగుతున్నప్పటికీ మత్స్యశాఖ లెక్కల్లో ఇది 3,000 ఎకరాలకే పరిమితమైంది. వీటి రిజిస్ట్రేషన్ విషయంలోనూ అనేక ప్రతిబంధకాలు ఉన్నాయి. అసైన్డ్ భూముల క్రయవిక్రయాలన్నీ అనధికారిక అగ్రిమెంట్ల ద్వారానే జరుగుతుంటాయి. నిబంధనల ప్రకారం వీటిని నమోదు చేయాలంటే అనుభవదారు సర్టిఫికెట్ ఉండాలి. ఇది రెవెన్యూశాఖ జారీ చేస్తే మత్స్యశాఖ రిజిస్ట్రేషన్ చేస్తుంది. ఇది కూడా కేవలం ఒరిజినల్ అసైనీ వారసులకే ఈ వెసులుబాటు అని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఇప్పటికే అసైన్డ్ భూములు మూడు, నాలుగు చేతులు మారి ఉండడంతో క్షేత్రస్థాయిలో రిజిస్ట్రేషన్ అనేది సాధ్యపడని విషయంగా తయారైంది. నిబంధనలు ఉల్లంఘించి అడ్డగోలు సాగు ఓ వైపు, సాంకేతిక ప్రతిబంధకాలు మరో వైపు వంద శాతం రొయ్యల సాగు రిజిస్ట్రేషన్ అనేదాన్ని క్లిష్టతరంగా మార్చేశాయి. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల పరిధిలో 22,558 ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతున్నట్లు మత్స్యశాఖ తేల్చింది. ఇందులో సీఏఏ(కోస్తా ఆక్వాకల్చర్ అథారిటీ) లెక్కల ప్రకారం రిజిస్ట్రేషన్ జరిగింది 14,400 ఎకరాలే. గడువు పూర్తయిన వాటిని వెంటనే రెన్యువల్ చేయడంతో పాటు రొయ్యల సాగు మొత్తాన్ని రిజిస్ట్రేషన్ గొడుగు కిందకు తేవాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఏడాది గడువుతో రొయ్యల సాగుకు ఇచ్చే సీఓసీ(కల్టివేషన్ ఆఫ్ సర్టిఫికెట్)కి జిల్లాలో ఒక్క దరఖాస్తు రాకపోవడం గమనార్హం.


అడవులదీవి సమీపంలోని వాన్‌పిక్ భూముల్లో అనధికార ఆక్వా సాగు (పాత చిత్రం)

పొంతన లేని లెక్కలు..

ఆక్వా అనధికారిక సాగును కట్టడి చేయాలనే ప్రయత్నమే గత ప్రభుత్వంలో చేయకపోగా అడ్డగోలు సాగుకు గేట్లు ఎత్తేసింది. దీంతో సీఏఏ నిబంధనలు గాలికి కొట్టుకుపోయాయి. రికార్డుల్లో ఉండే లెక్కలకు, వాస్తవ సాగుకు పొంతన లేకపోవడంతో మొత్తం ఆక్వా రంగమే గాడి తప్పింది. ఇక అసైన్డ్ భూముల క్రయవిక్రయాలే నేరమని చట్టం చెబుతుంటే ఏకంగా ఆ భూముల్లో రొయ్యల సాగు తంతు ఏళ్ల తరబడి సాగుతోంది. ఈ అనధికారిక రొయ్యల సాగును క్రమబద్ధీకరించి చిన్న, సన్నకారు ఆక్వా రైతులకు మేలు చేయడంతో పాటు వాస్తవ సాగు ఆధారంగా భవిష్యత్ ప్రణాళికలు రచించి సంక్షోభం నుంచి ఆక్వా రంగాన్ని గట్టెక్కించాలన్నది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఇది సాధ్య పడాలంటే ముందుగా అడ్డగోలు సాగుపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించాలి.

మొత్తం రిజిస్ట్రేషన్ సాధ్యపడదు...

ఆక్వా సాగు మొత్తాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేయాలంటే సాధ్యపడదనే అభిప్రాయాన్ని మత్స్యశాఖ వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా వాన్‌పిక్ భూముల్లో రొయ్యల సాగు అంశంలో ఏం చేయాలో పాలుపోవడం లేదని యంత్రాంగం అంటోంది. వాన్‌పిక్ భూములతో పాటు అసైన్డ్ భూముల్లో రొయ్యల సాగు లెక్కలను సమగ్రంగా ప్రభుత్వానికి నివేదించనున్నామని మత్స్యశాఖ చెబుతోంది. ఇప్పటికే ఆక్వా సాగు నమోదుకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నడుస్తోందని, మరో వారం రోజుల్లోనే పూర్తిస్థాయి స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం అయితే రిజిస్ట్రేషన్ చేయని చెరువులను ధ్వంసం చేసే అధికారం చట్టం కట్టబెట్టింది. కానీ ప్రభుత్వం వైపు నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తే తప్ప వీటి విషయంలో ముందుకెళ్లలేమని అధికారులు చెబుతున్నారు. నెల రోజుల్లోనే ఆక్వా సాగుకు సంబంధించి కచ్చితత్వంతో కూడిన నమోదుతో సిద్ధంగా ఉండాలనే ఆదేశాలు ఇప్పటికే మత్స్యశాఖకు అందాయి. ఇందుకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ కూడా యంత్రాంగం చేపడుతోంది. ఎలా ముందుకెళ్లాలన్న దానిపై యంత్రాంగానికి స్పష్టత లేదు. రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని భూముల విషయంలో క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికనే ప్రభుత్వానికి ఇవ్వడానికి మత్స్యశాఖ సిద్ధమవుతోంది. దీని ఆధారంగానే అనధికారిక రొయ్యల సాగుపై ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దైవ దర్శనానికి శ్రీశైలం వెళ్తూ చట్టుతాండా వద్ద మోటారు సైకిలు వేగం అదుపు తప్పి కింద పడి నందికొట్కూరుకు చెందిన కే రాజేష్ బుధవారం గాయపడిన విషయం తెలిసిందే. కర్నూలు వైద్యశాలలో చికిత్సలు పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

నేటి నుంచి డయల్ యువర్ డీఎం

పొదిలి, సెప్టంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్‌రావుగురువారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు సమస్యలను తెలియజేవచ్చని సూచించారు.

21న సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఆదివార మధ్యాహ్నం 3గంటలకు సీనియర్స్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షులు యనమల సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27, 28 తేదీలలో ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు సెల్ : 9381657774 ద్వారా సంప్రదించాలన్నారు.

మోటార్‌సైకిల్‌పై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

- ఇద్దరికి స్వల్ప గాయాలు

కొండపి,సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు మోటార్‌సైకిల్‌పై వెళ్తూ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో తారురోడ్డుపై పడి గాయాల పాలైన ఘటన గురువారం మధ్యాహ్నం టంగుటూరు రోడ్డులోని రెస్టారెంట్ సమీపంలో జరిగింది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం మర్రిపూడి మండలం చిలంకూరు గ్రామానికి చెందిన ముగ్గురు ఇద్దరు యువకులు మధ్యలో ఓ యువతిని కూర్చొబెట్టుకుని వేగంగా కొండపి నుంచి టంగుటూరు వైపు వెళ్తున్నారు. ఇంతలో సమీప దూరంలో రోడ్డు పక్క నుంచి ఓ మోటార్ సైకిల్ వచ్చింది. దీంతో వేగంగా వెళ్తున్న మోటార్ సైకిల్ నడిపే వ్యక్తి సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తికి కాళ్లు, చేతులుపై చర్మం కోసుకుపోవడంతోపాటు తలకు తీవ్రమైన గాయం అయింది. మోటార్‌సైకిల్‌పై ఉన్న యువతికి, వెనుక ఉన్న యువకుడికి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. దీంతో గాయపడిన వ్యక్తికి వెనుక వున్న యువకుడు తన చొక్కా విప్పి తల గాయం నుంచి రక్తం కారకుండా అడ్డ పెట్టాడు. ఘటనను చూసిన కొందరు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించగా, వారు బాధితులు ముగ్గురిని కొండపి సీహెచ్‌సీకి తరలించారు.

ఎస్పీని కలిసిన మాగుంట



జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును సత్కరిస్తున్న ఎంపీమాగుంట

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్‌రాజును ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి స్థానిక ఎస్పీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్పీని శాలువతో సత్కరించి బొకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన

బల్లికురవ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారం తీసుకోవడం వలన కలుగు లాభాల గురించి తల్లులకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబీ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో పోషణ మాసోత్సవాలలో భాగంగా గ్రామ సంఘాల అధ్యక్షులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు చక్కెర, నూనె అధికంగా వాడితే పలు రకాల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వాటి వాడకాన్ని వీలైనంత మేర తగ్గించాలన్నారు. బలవర్ధకమైన అహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంది స్తున్న పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం రాజారావు, భాస్కర్, సీసీలు పేరయ్య ప్రమీలా, డేవిడ్ అంగన్ వాడీ కార్యకర్తలు శ్రీదేవి, రాజకుమారి తదితరులు ఉన్నారు.





అహ్లాదకరమైన సూర్యలంక సముద్రతీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు



సుందర మనోహరం.. సూర్యలంక తీరం

- ఆంధ్ర గోవా.. ప్రకృతి సోయగాలెన్నో..
- పర్యాటక శాఖ సౌకర్యాలతో..మరింత అహ్లాదం
- భక్తుల పుణ్య ప్రదేశం..పర్యాటకులకు వినోద భరితం
- బీచ్ ఫెస్టివల్‌తో దేశవ్యాప్తంగా మరింత ఖ్యాతి

బాపట్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అత్యంత సుందరమైన, ఆహ్లాదకరమైన సూర్యలంక సముద్ర తీరం విశేష ఖ్యాతినార్జించింది. భక్తజనకోటి మదిలో పదిలంగా జలాశీస్సులు అందిస్తూ.. ఎంతో ప్రాముఖ్యత, మరెంతో ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకుల్ని కనువిందు చేస్తున్న సూర్యలంక సుందర మనోహర వేదికగా విరాజిల్లుతోంది. ఆంధ్ర గోవాగా ఖ్యాతిగాంచిన సూర్యలంక తీరం తూర్పు దిక్కు నుంచి దక్షిణ దిశగా అర్ధ చంద్రాకృతిలో ఉండటం విశేషంగా పేర్కొంటారు. దీనివల్ల తుఫాన్లు, వరదలు సంభవించినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని చెబుతుంటారు. అలాగే భావదేవుని ఆశీస్సులు మెండుగా ఉంటాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. సముద్ర తీరం చదునుగా ఉండటంతో పుణ్య స్నానాలు చేసే భక్తులకు, వృద్ధులకు, పిల్లలకు ఈ తీరం ఎంతో అనువుగా ఉంటుంది. తెల్లవారు జామున సూర్యోదయం అత్యంత రమణీయంగా, శోభాయమానంగా కనిపిస్తుంది. దీనిని తనివితీర తిలకించేందుకు తెల్లవారు జామున భక్తులు, పర్యాటకులు ఇక్కడకు విచ్చేస్తుంటారు. పుడమి తల్లిని పులకరింప చేసే ఉదయ భానుడు లేలేత కిరణాలు తొలి చలనం ద్వారా అవిష్కృతమై వీక్షకులకి కనువిందు చేస్తాయి. రాష్ట్రంలోని ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచే కాకుండా కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, నల్గొండ, ఉభయగోదావరి జిల్లాలు.. హైదరాబాద్ తదితర ప్రాంతాలు నుంచి లక్షలాది మంది పర్యాటకులు, భక్తులు విచ్చేస్తుంటారు. కార్తిక స్నానాల స్వర్గదామంగా విరాజిల్లుతున్న బాపట్ల సముద్ర తీరానికి విదేశీ పర్యాటకులు అనేక మంది విచ్చేస్తుంటారు. ప్రపంచ నలమూలల నుంచి ఇక్కడకి వచ్చిన ఎందరికో ఈతీరం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- **హరిత సోయగం**

పచ్చదనాన్ని వెదజల్లుతూ తీరం దారిపొడుపునా ఇరువైపులా విస్తరించిన అడవి ఇక్కడి మరో ప్రత్యేకత. లక్షలాదిగా విచ్చేసే యాత్రికులకు, భక్తులకు ప్రకృతి ప్రసాదించిన మడ చెట్లు.. చల్లని వాతావరణంతో కార్తిక మాసంలో బృందా వనంలా ఉంటాయి. అటవీ శాఖ సంరక్షణలోని జీడి, సరివి, జామాయిల్ తోటలు విస్తారంగా ఉండటంతో వనభోజనాది కార్యక్రమాలకు సౌకర్యంగా ఉన్నాయి.

- **కనువిందు చేసే పొగురు**

సూర్యలంక సముద్ర తీరాన్ని సందర్శించే పర్యాటకులకు ఇక్కడ పొగురు ప్రాంతం ఆకట్టుకుంటుంది. తీరం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ పొగురు ఉంది. కాల్వలు అన్ని సముద్రంలో కలిసే ఈ సన్నివేశం చూడ ముచ్చటగా ఉంటుంది. నల్లమడ వాగు, పేరలి కాల్వలు సముద్రంలో కలిసే ప్రాంతాన్ని పర్యాటకులు ప్రత్యేకంగా సందర్శించి తిలకిస్తుంటారు. సూర్యలంక అందాల వెనుక ఇదో అద్భుతం.

- **అంజనేయస్వామి ఆశీస్సులు**

సముద్రతీరానికి విచ్చేసే యాత్రికులకు తీరంలో వేంచేసియున్న భజనాంజనేయస్వామి వారి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారంలా ప్రసిద్ధి పొందింది. పుణ్య దినాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. తీరానికి తూర్పు ముఖంగా ప్రతిష్ఠించిన ఈ ఆలయంలో నిత్యం భక్తులు పూజలు చేస్తుంటారు. స్వామి వారి అనుగ్రహం భక్తులపై సదా ఉంటుందని విశ్వసిస్తుంటారు.

- **రవాణా, వసతి సౌకర్యం**

సూర్యలంక తీరానికి విచ్చేసే యాత్రికులకు రవాణా సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. బాపట్ల పట్టణం నుండి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యలంకను సందర్శించేందుకు ఆర్టీసీ సర్వీస్‌లు, ఇతర వాహనాలు ఉన్నాయి. బాపట్ల రైల్వేస్టేషన్ నుంచి ఇక్కడకు నేరుగా విచ్చేసేందుకు ఆటో సర్వీస్‌లు ఉన్నాయి. పర్యాటకులు సేద తీరేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఏసీ కాటేజీలు అందుబాటులో ఉన్నాయి. హరితా బీచ్ రిసార్ట్స్ పేరుతో ఈ సదుపాయాలను పర్యాటక శాఖ అమలు చేస్తోంది. ఇవి కాకుండా అనేక ప్రైవేట్ అతిథి గృహాలు, లాడ్జిలు అందుబాటులో ఉన్నాయి.

జీఎస్‌టీ సంస్కరణలతో దేశంలో ఆర్థిక విప్లవం

ప్రజల ఆర్థిక ప్రగతికి లాభదాయకం

వైద్య, వ్యవసాయ, విద్యా రంగాలకు ఊతం

అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ ఆర్థిక విప్లవానికి నూతన జీఎస్టీ సంస్కరణలు అద్భుతంగా దోహదపడతాయని, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశం సందర్భంగా అయన జీఎస్‌టీ నూతన సంస్కరణలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. నూతన సంస్కరణలతో ప్రజలు, పరిశ్రమలకు, ఆర్థిక ప్రగతికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో ప్రజలకు పన్నుల భారం నుంచి వెసులుబాటు కలుగుతుందన్నారు. వైద్యం, విద్య వ్యవసాయం పరిశ్రమల రంగానికి ఊతం ఇచ్చిందన్నారు. 2017లో మొదలైన జీఎస్టీ విప్లవం మొదలైందన్నారు. ఒక దేశం ఒకే పన్ను విధానం ద్వారా ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. 2018లో భారతదేశ జీఎస్‌టీ ఆదాయం రూ.7 లక్షల కోట్లు ఉంటే 2020 నాటికి రూ.12 లక్షల కోట్లు అయ్యిందన్నారు. ప్రస్తుతం జీఎస్‌టీ పరిధిలో కోటిన్నర మంది ఉన్నారన్నారు. తద్వారా ప్రభుత్వ మెరుగైన పన్ను విధానాన్ని అమలులోనికి తెచ్చిందన్నారు. క్యాన్సర్ జబ్బులకు వాడే మందులను జీరో ట్యాక్స్‌లోకి తీసుకువచ్చారని ఇది చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. అత్యవసర మందులపై జీఎస్టీ పన్ను లేకుండా చేయడం హర్షింతగ్గ విషయమన్నారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజల చేతిలో సంపద పెరిగే వస్తువల వినియోగం పెరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుస్థిర నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడుల వరద వస్తోందన్నారు. అలాగే యువనేత నారా లోకేష్ ఏడాది కాలంలోనే 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించేలా కృషి చేస్తున్నారన్నారు.

శతక పద్య పోటీ విజేతలకు జ్ఞాపికలు



గెలుపొందిన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

వంగులూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు ఉన్నత పాఠశాలలో గురువారం మూడు విభాగాలలో మండలస్థాయి శతక పద్యపోటీలు నిర్వహించారు. ప్రాథమికస్థాయిలో రిఖిల్‌షాన్ (వంగు లూరు), డోలాంజలి(కోటపాడు), ప్రాథమికోన్నతస్థాయిలో నిఖిత (కోటపాడు), శ్రేష్ఠ(వంగులూరు), ఉన్నత పాఠశాల స్థాయిలో మమత (రేణంగివరం), కీర్తన(వంగులూరు) ప్రథమ, ద్వితీ య స్థానాలు సాధించారు. గెలుపొందిన బాలబాలికలకు ఎంఈవో వీరాంజనేయులు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అజిత్‌ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ, హెచ్‌ఎంలు వడ్లమూడి వేణుబాబు, గుర్రంలక్ష్మీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితుల ఐక్యతతోనే రాజ్యాంగ పరిరక్షణ

మాజీ ఎంపీ చింతా మోహన్



అంబేడ్కర్‌నగర్‌లో ర్యాలీగా వెళ్తున్న చింతా మోహన్, నాయకులు

టంగుటూరు(కొండపి), సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): దళితులు ఐక్యతతోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. గురువారం సాయంత్రం టంగుటూరులోని అంబేడ్కర్ నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అంబేడ్కర్‌నగర్‌లో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఆయన స్థానికులతో మాట్లాడారు. అనంతరం చింతామోహన్‌ను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు, రాష్ట్ర నాయకుడు చితామణి, సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దానరి చెన్నకేశవులు, రాష్ట్ర మాలల జేఏసీ నాయకుడు లాయర్ బాల నారాయణ, మేడిద రవి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో భారీ వర్షం



మార్టూరులో పెద్ద ఖానా వద్ద వర్షపునీరు

మార్టూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మధ్యాహ్నం దాదాపుగా గంటసేపు భారీ వర్షం కురిసింది. మార్టూరు బొలావల్లి, కోలలపూడి తాటివారిపాలెం, కోనంకి, వలపర్ల గ్రామాలలో భారీగా వర్షం కురిసింది. దీంతో టోల్‌ప్లాజా సమీపంలోని పొలాల్లో భారీగా వర్షపు నీళ్లు నిలిచాయి. ఆదేవిధంగా మార్టూరులో పెద్ద ఖానా వద్ద వర్షపునీళ్లు నిలిచాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అయితే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో జాతీయ రహదారి వెంబడి వర్షపు నీరు వెళ్లే విధంగా పనులు చేపట్టారు. దీంతో కొంతమేర సర్వీసు రోడ్లులో నీళ్లు నిలబడకుండా వెళ్లడంతో వాహనదారులు ఊపరిపీల్చుకున్నారు. వర్షంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ విజయ

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను అసిస్టెంట్ కమీషన్ కె.విజయ గురువారం తనిఖీచేశారు. స్థానిక స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించి పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసులను త్వరిత గతిన పరిష్కరించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ ఎం.భుజంగరావుకు సూచించారు. షాపుల నిర్వహణలో సమయ పాలన తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

మార్టూరు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని చిమ్మిరిబండ గ్రామ పొలాల్లో పిడుగుపడి దుడ్డు కోర్నేలు (58) అనే వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 3:30 నిమిషాలకు జరిగింది. గ్రామ వీఆర్‌వో గుమ్మడి నాగు కథనం ప్రకారం.., మృతుడు కోర్నేలు మధ్యాహ్నం సమయంలో తన సొంతపొలంలో వరి విత్తనాలను ఎదపెట్టడానికి వెళ్లిన సమయంలో, పొలంలో పిడుగు పడి మృతి చెందారు. దీంతో అతని శరీరం చాలా వరకు కాలిన గాయాలు ఉన్నాయి. మృతునికి భార్య జయమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారందరికి వివాహమయ్యింది. నెల రోజులు క్రితంవివాహమైన చిన్న కుమార్తె హైదరాబాదులో ఉండడంతో భార్య జయమ్మ అక్కడకు వెళ్లారు. ఈ ప్రమాదంపై వీఆర్‌వో సేకరించిన వివరాలను తహసీల్దార్ టి.ప్రశాంతికి పంపించారు. దీంతో ఆమె నివేదికను తయారుచేసి కలెక్టర్ కు పంపించారు. ఇదిలా ఉండగా చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో చక్రం ఊడి డ్రైవర్‌కు గాయాలు

పేరాల(చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణ సమయంలో అకస్మాత్తుగా ఆటో ముందు చక్రం ఊడి పోవడంతో డ్రైవర్ గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం ఉదయం పేరాల ముత్యాలపేటలో చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం ఆటో డ్రైవర్ ప్రయాణీకులను చీరాల రైల్వే స్టేషన్‌లో దించేందుకు ముత్యాలపేటలో నుంచి వెళుతుండగా అకస్మాత్తుగా ముందుచక్రం ఊడి ఆటో ఓ గోడను ఢీ కొంది. ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

మార్టూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి బి.హనుమంతనాయక్ మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గుచూపితే ఉద్యానశాఖ ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. రైతులు పంట సాగు చేపడితే మంచి ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి ఖాషా, గ్రామ వ్యవసాయన హాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

సంతనూతలపాడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలలకు ఉన్న హక్కులు , సమస్యలను ఏవిధంగా ఎదుర్కోవాలో జిల్లా మహిళా, శిశుసంక్షేమశాఖ సాధికారతాధికారిణి ఎస్.సువర్ణ అవగాహన కల్పించారు. మండలంలోని పేర్నమిట్ట జడ్పీహైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 6నుంచి 18 సంవత్సరాల వయసుగల పిల్లలకు అభివృద్ధిని, సాధికారతను, రక్షణను అందించడం ద్వారా బాల్యవివాహాలు అడ్డుకోవచ్చని తెలిపారు. బాలల హక్కులకు భంగం వాటిల్లితే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 112, 181, 100లకు సమాచారం ఇవ్వవచ్చని బాలబాలికలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షితమైన మందుల వినియోగం ఆరోగ్యకరం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సురక్షితమైన మందులు వాడటం వలన ఆరోగ్యం లభిస్తుందని, తద్వారా మెరుగైన జీవన విధానం అందించవచ్చని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా గురువారం జీజీహెచ్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ నిర్ధారిత మందులు వాడకంతో పాటు అనవసరమైన మందుల వాడకం తగ్గించేలా కృషి చేయాలన్నారు. జీజీహెచ్‌కు విచ్చేసే రోగులకు మందుల వాడకంపై విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు.

మందుబాబులతో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తగలబెట్టిస్తున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు

టంగుటూరు/కొండపి, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు నుంచి రాగాయి కుంటకు పోయే దారిలో మందుబాబులు పొలాల్లో మద్యంతాగి వ్యర్థాలను వదిలివేసి పొలాలను చెడగొడుతున్నారు. ఈ నేపథ్యంలో టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు ప్రత్యేక నిఘా ఉంచి మందుబాబులను, ఆకతాయిలను గుర్తించి గురువారం రాత్రి మందుబాబులతో పొలాల్లోని వ్యర్థాలను వారితో తొలగింపచేశారు. వ్యర్థాలను మందుబాబులతో కాల్పించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పదేపదే ఇటువంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని వారిని హెచ్చరించారు. పొలాల్లో మద్యం తాగి వ్యర్థాలను వడేసే వారిపై చర్యలు తీసుకున్నందుకు స్థానికులు, పొలాల రైతులు ఎస్సైను అభినందిస్తున్నారు.

చెత్త రహిత అద్దంకిగా మార్చేందుకు సహకరించాలి



చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు

అద్దంకి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): చెత్తరహిత అద్దంకిగా మార్చేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గరటయ్య కాలనీ వద్ద చెత్త సేకరణ, అద్దంకి కొండ వద్ద డంపింగ్ యార్డులో చెత్తను శుద్ధి చేస్తున్న ప్రాంతాలను లక్ష్మీశ్రీనివాసరావు, మున్సిపల్ కమీషనర్ రవీంద్రలు గురువారం పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాపరికరాల వితరణ అభినందనీయం

● డిప్యూటీ ఈవో గంగాధర్



క్రీడాపరికరాలను పాఠశాలకు అందజేస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

పంగులూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాలకు పూర్వవిద్యార్థి గోపీకృష్ణ క్రీడాపరికరాలు సమకూర్చడం అభినందనీయమని చీరాల డివిజన్ డిప్యూటీ డీఈవో గంగాధర్ అన్నారు. మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి గోపీకృష్ణ రూ.28వేల విలువైన క్రీడాపరికరాలు సమకూర్చగా, ఆ పరికరాలను డిప్యూటీ ఈవో డి.గంగాధర్ గురువారం పాఠశాల వ్యాయామోపాధ్యాయులకు అందజేశారు. పాఠశాల విద్యార్థులు దాతల అందించిన సహకారంతో చదువు, క్రీడలలో ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గిరిజ, పీడీలు, కె.మధు, కె.ప్రతిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో వీరాంజనేయులు

పంగులూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఎంఈవో జి.వీరాంజనేయులు కోరారు. చందలూరు ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. అండర్-17 బాలుర విభాగంలో జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీలలో చందలూరు విద్యార్థులు గెలుపొందగా, బాలికల విభాగంలో కబడ్డీలో కొండమంజులూరు, వాలీబాల్ పోటీలో బూదవాడ విద్యార్థినులు గెలుపొందారు. యోగా టీమ్‌ఈవెంట్‌లో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు లిఖిత, భవ్యశ్రీ, శృతి, అమూల్య, హెప్సిబ, సరిత విజయం సాధించారు. చెస్ ఈవెంట్‌లో కొండమంజులూరు విద్యార్థులు చైతన్య వరప్రసాద్, హనుక్‌బాబు, చందలూరు విద్యార్థులు కౌశిక్, పవన్, షమిత్‌నాయుడు గెలుపొందారు. గురువారం జరిగిన మండలస్థాయి పోటీలలో గెలుపొందిన జట్లు 19న పందిళ్లపల్లెలో జరిగే చీరాల డివిజన్‌స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల పీడీలు మధు, ప్రతిమ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో హెచ్ఎం. గిరిజ, అజిత్‌ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ, వివిధ పాఠశాలల పీడీలు హనుమయ్య, హరిబాబు, వెంకట్రావు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో వలపర్ల హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



క్రీడలలో పతకాలు సాధించిన బాలబాలికలతో ఉపాధ్యాయులు

మార్టూరు,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బేపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 16, 17 తేదీలలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలలో వలపర్ల హైస్కూల్ కు చెందిన 20 మంది బాలబాలికలు పతకాలను సాధించినట్లు పీఈటీ రవి దేవరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో అండర్-14 విభాగంలో బాలురు, బాలికలు జట్లు ప్రథమ స్థానాలను గెలుచుకున్నాయి. ఆదేవిధంగా రన్నింగ్, లాంగ్‌జంప్, చెస్, వాలీబాల్ పోటీలలో బాలబాలికలు మంచి ప్రతిభను కనబరచారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కల్యాణి, పీఈటీలు రవి దేవరాజ్, యోకోబు, విద్యాకమిటీ చైర్మన్ కే.రమేష్‌లు బాల బాలికలను అభినందించారు.

స్మార్ట్ కార్డులతో బహుళ ప్రయోజనాలు

● లబ్ధిదారులకు అందజేసిన అధికారులు, టీడీపీ నేతలు

● పారదర్శకంగా సులభంగా సరుకులు పొందవచ్చని వెల్లడి

దేవాంగపురి(చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తాజాగా అందిస్తున్న స్మార్ట్ కార్డులతో బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని యువ నాయకులు గౌరీఅమర్నాథ్, తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని దేవాంగపురిలో ప్రజలకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ నూతన విధానం ద్వారా సులభతరంగా సరుకులు అందుకోవచ్చని వివరించారు. ప్రభుత్వ పథకాలకు కార్డును గుర్తింపుగా వినియోగించుకోవచ్చని తెలిపారు. అలాగే నిత్యావసరాల పంపిణీలో పారదర్శకంగా వీలుంటుందని చెప్పారు. నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



రాజుబంగారుపాలెంలో కార్డులను పంపిణీ చేస్తున్న నేతలు

ఇంకొల్లు : పేదల సంక్షేమమే ప్రజా కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు అన్నారు. తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం స్మార్ట్ రేషన్‌కార్డులను అర్హులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర మాలకార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్‌కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌కార్డులు అందజేస్తామన్నారు. మండలంలో 15,500 స్మార్ట్ రేషన్ కార్డులు ఉన్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, రాష్ట్ర వాణిజ్యవిభాగపు ప్రధాన కార్యదర్శి పాలేరు రామకృష్ణ, ఇంకొల్లు పీఏసీఎస్ చైర్మన్ కరి శ్రీనివాసరావు, టీడీపీటౌన్ అధ్యక్షులు మార్క్, చిలుకూరి శ్రీనివాసరావు, బోడెంపూడి సుబ్బారావు, మీరావలి, సీతారామయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

16,931 స్మార్టు కార్డులు

బల్లికురవ : మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో పేదలకు ప్రభుత్వం 16,931 స్మార్టు రేషన్ కార్డులను మంజూరు చేసిందని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. ఈ కార్డులను గ్రామాలో ఉన్న రేష న్ షాపుల ద్వారా ప్రజలకు అందజే స్తామన్నారు. గతంలో ఉన్న రేషన్ కార్డుల స్థానంలో ప్రభుత్వం స్మార్టు కార్డులను ప్రవేశపెట్టింద న్నారు.

చినగంజాం : మండల పరిధిలోని రాజుబంగారు పాలెం, సోపిరాల గ్రామంలోని చౌకధరల దుకాణాల్లో గురువారం స్మార్ట్‌రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్డులతో సరుకులు సులభంగా పొందవచ్చని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్ఐ బండారు దానియేలు, రాజుబంగారుపాలెం కార్యదర్శి ఉష, టీడీపీ నాయకులు కోకి ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, సందు శ్రీనివాసరావు, వాటుపల్లి ఏడుకొండలు, నరహరి శ్రీనివాసరావు, బోగిరెడ్డి కోటిరెడ్డి రేషన్‌డీలర్లు తదితలరులు పాల్గొన్నారు.



స్మార్ట్ రైస్‌కార్డులు అందజేస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ, అమర్నాథ్

రైతు సంక్షేమమే ప్రజాకూటమి ప్రభుత్వ లక్ష్యం

ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను (సూపర్‌సిక్స్) పథకాలను ప్రజా కూటమి ప్రభుత్వం అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతోందని ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు అన్నారు. దీంతో ఓర్వలేని వైసీపీ ప్రభుత్వంపై అసత్యపు ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. గురువారం స్థానిక ఏఎంసీలో పీఏసీఎస్ సొసైటీల అధ్యక్షులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అందుబాటులో ఉన్నా, కొరత ఉందని అసత్య ప్రచారం చేస్తోందన్నారు. యూరియాపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి మరీ ప్రభుత్వం సొసైటీల ద్వారా సరఫరా చేస్తోందన్నారు. ఖరీఫ్ సాగుకు ఎంత అవసరమో ఆ మేరకు నిల్వలున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కృష్ణ, పర్చూరు పీఏసీఎస్ అధ్యక్షులు కొల్లా చంద్రం, ఇంకొల్లు పీఏ సీయస్ అధ్యక్షులు కరి శ్రీనివాసరావు (గ్యాస్), నాగులపాలెం పీఏసీయస్ అడ్డగడ సుబ్బా రాయుడు, కోణికి పీఏసీయస్ బోడెంపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు

అద్దంకిటౌన్ : రైతులు సమగ్ర ఎరువుల యాజ మాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత డాక్టర్ జి. రమేష్ అన్నారు. గురువారం మండలంలోని గోవాడ గ్రామంలో రైతులతో కిసాన్ గోష్టి కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ దుక్కిలో నత్రజని ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. చివరి దుక్కిలో భాస్వరం ఎరువులు వినియోగిం చాలన్నారు. భాస్వరం ఎ రువుల వలన పంట వేరు వ్యవస్థ వృద్ధి చెందుతుందన్నారు., వేరు వ్యవస్థ వృద్ధి చెందిన తరువాత మాత్రమే మొక్క నత్రజని ఎరువులను తీసుకుంటుం దన్నారు. చివరి రెండు, మూడో దఫాలో మాత్రమే నత్రజని ఎరువులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ బి. ఎఫ్రాయిమ్, ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, ఉద్యానశాఖ అధికారిణి ఎస్.దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ ఉద్యాన సహాయకురాలు శ్రీలక్ష్మి, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమేష్

సంఘటితంగా ఉంటేనే కార్మికుల సమస్యలకు పరిష్కారం

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వసంతరావు

● ఘనంగా ఆ సంఘం 4వ మహాసభ

వేటపాలెం (చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారమని పలువురు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వసంత రావు పేర్కొన్నారు. ఆ సంఘం మండల 4వ మహాసభ గురువారం రామన్నపేట ఆక్వా అసోసియేషన్ భవనంలో ఇండ్ల బ్రహ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విడిచిపెడుతున్నాయని, పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్ బాబురావు, మచ్చ అయ్యప్ప, తన్నీరు శ్రీనివాసరావు తదితర కార్మికులు హాజరయ్యారు.

21 సీఐటీయూ మండల మహాసభ

అద్దంకిటౌన్ : సీఐటీయూ అద్దంకి మండల మహాసభలు 21న సుందరయ్య భవనంలో జరగనున్నాయని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలే కర్లతో మాట్లాడారు. మహాసభలను సీఐటీయూ తో పాటు అనుబంధ సంఘాల నాయకులు కూడా విజయవంతం చేయాలన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

అద్దంకిటౌన్ : మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్‌సీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేప ట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచిందన్నారు. నేటికీ కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించలేద న్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు గత జూలైలో జరిగిన సమ్మె కాలానికి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ రవీంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఆదాం, ఉసురుపాటి శామ్యూల్, జ్యోతి వెంకట్రావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

ఇంకొల్లు, సెప్టెంబరు 18,(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖర్ల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తూ రెండు రోజుల పాటు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్ర, శనివారాలలో రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సేవలు నిలిపివేస్తున్నట్లు ఇంకొల్లు మండలంలోని దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తానికొండ ఏలియాజర్, బండ్ల సుబ్బారావు, వంకాయలపాడు శ్రీనివాసరావు తెలిపారు.

ప్రభుత్వ సాయంపై ఆటోడ్రైవర్ల హర్షం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

అద్దంకి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ లకు ఏటా రూ.15 వేలు జమ చేస్తోందని, ప్రకటించడంతో ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని మణికేశ్వరంలో గురువారం సాయంత్రం ఆటోడ్రైవర్లు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు, లోకేష్, గొట్టిపాటి రవికుమార్‌ల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బడావలి, ఈసు, ఆదినారాయణ, రూబేను, రవీంద్ర, రవి, దాను, ప్రసాద్, మహేష్, చినబాబు, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం

చీరాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలుచోట్ల అంతరాయం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విఠల్‌నగర్, వైకుంఠపురం, స్వర్ణ రోడ్డు, లైబ్రరీ రోడ్డు, దండుబాట, హరిప్రసాద్‌నగర్, ఉజిలీపేట, జయంతిపేట ఐక్యనగర్, మరియమ్మపేట, కొత్తపాలెం ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, మరమ్మతుల అనంతరం యధావిధిగా సేవలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

రహదారికి తెలుగు యువత మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

వేటపాలెం (చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలంలో రహదారి మరమ్మతులకు తెలుగుతమ్ముళ్లు నడుం బిగించారు. రహదారి గుంతల మయంగా ఉండి, వాహన దారులు ప్రమాదాల బారిన పడుతుండడంతో స్వయంగా రోడ్డు మరమ్మతులు నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్య స్ఫూర్తితో అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నట్లు దోగుపర్తి బాలకృష్ణ, కొత్త నాగు, భవానీ శంకర్, తదితరులు చెప్పారు.

సరైన ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం

● వేటపాలెంలో ఘనంగా పోషణ మాసం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీడీపీవో

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ఆహార అలవాట్లు కచ్చితంగా ఆచరించడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో ఝాన్సీ తెలిపారు. గురువారం వేటపాలెం మండల పరిధిలోని నీలకంఠాపురంలో రాష్ట్రీయ పోషణ మాసం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాలు నివారణకు స్థానికుల సహకారంతోనే సాధ్యమన్నారు. తద్వారా బాలికల అభివృద్ధి సాధ్యమని వివరించారు. గర్భిణులు, బాలింతలకు సంబంధించి పలు సూచనలు చేశారు. పోషణ మాసం గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీరాల ప్రాజెక్టు మేనేజర్ నవీన్, సూపర్‌వైజర్ పుష్పవల్లి, ఏఎన్ఎం సునీత, సీహెచ్‌వో ఏంజిల్, అంగన్వాడీలు అంజనదేవీ, బ్యూలా, మౌనిక, స్రవంతి, పద్మ, లక్ష్మీ, మహిళ పోలీస్ కరుణ, గ్రామ పెద్దలు బుల్లయ్య, సుబ్బారావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీడీపీవో, ఏపీఎం

సంతమాగులూరు సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో సుధా పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం హనుమంతరావు అధ్యక్షతన 'బేటీ బచావో, బేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో డి.సుధ మాట్లాడుతూ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణచట్టం, సుకన్య సమృద్ధి యోజన పథకం, బాలిక విద్యా ప్రాముఖ్యత పోషణకు సంబంధించిన అంశాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు నాగబోతు సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ ఎం సుష్మరాణి, జి.ప్రమీల, బ్లాక్‌ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి ఉమా తదితరులు పాల్గొన్నారు.

అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నరేంద్రకుమార్

● ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

● అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి



కొల్లా నరేంద్రకుమార్

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు కోర్టు భవనాల సముదాయ సీనియర్, జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా సీనియర్ న్యాయవాది కొల్లా నరేంద్రకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆయన ఇన్‌చార్జ్ ఏజీపీగా ఉన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు, న్యాయవాది వృత్తిలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఏజీపీగా నియమితులైన కొల్లా నరేంద్రకుమార్‌ను స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అభినందించారు. అదేవిధంగా పలువురు న్యాయ వాదులు ఆయనకు శుభాకంక్షలు తెలియజేశారు.

క్రిబ్కో చైర్మన్ సుధాకర్ చౌదరితో ఏలూరి భేటీ



సుధాకర్‌చౌదరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : క్రిషక్ భారతి కో- ఆపరేటివ్ లిమిటెడ్ (క్రిబ్కో) నూతన చైర్మన్‌గా ఎన్నికైన విజయవాడకు చెందిన ప్రముఖ తెలుగు వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరితో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం విజయవాడలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏలూరి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించి, శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఆత్మీయ మిత్రుడు అత్యుత్తమ క్రిషక్ భారత్ కోపరేటివ్ లిమిటెడ్ చైర్మన్‌గా నియామకం కావడం హర్షించతగ్గ విషయమన్నారు. నిబద్ధత కలిగిన వ్యక్తికి అరుదైన గౌరవం దక్కడం ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణ మన్నారు. యువ పారిశ్రామిక వేత్తలకు సుధాకర్ రోల్ మోడల్‌గా నిలుస్తున్నారన్నారు. రైతు సంక్షేమం అభివృద్ధికి సుధాకర్ చౌదరి కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. ఏలూరితోపాటు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉన్నారు.

ఏరియా వైద్యశాలలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్

దేవాంగపురి (చీరాల), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన మహిళ - శక్తివంతమైన కుటుంబానికి మూలమని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏరియా వైద్యశాలలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ ఆరోగ్య కోసం స్క్రీనింగ్ పరీక్షలు అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. యువనాయకులు గౌరీ అమర్నాథ్ మాట్లాడుతూ క్యాన్సర్ వంటి వాటిని ముందస్తుగా గుర్తించి నియంత్రించాలని చెప్పారు. అలాగే ఆస్పత్రుల్లో రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెంట్ శ్రీకాంత్, పలువురు వైద్యులు, పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్కూటీపై చూడ 'ముచ్చు'టగా



స్కూటీపై దర్జాగా కూర్చున్న కొండముచ్చు

అద్దంకి,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): కొండముచ్చు స్కూటర్‌పై కూర్చొని దర్జాగా షికారు చేస్తోంది. శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద గోవాడకు చెందిన శింగయ్య కొండముచ్చును పెట్టుకొని భక్తులు ఇచ్చే డబ్బులతో గడుపుతుంటాడు. కొండముచ్చు సమీపంలో ఉంటే కోతులు దరిదాపులకు కూడా రావు. అయితే శింగయ్య తన స్కూటర్ పై అద్దంకి వస్తూ కొండముచ్చును కూడా ఎక్కించుకున్నాడు. స్కూటర్ వెనుక వైపు కొండముచ్చు దర్జాగా కూర్చుంది. కొండముచ్చు దర్జాను పలువురు ఆశ్చర్యంగా తిలకించారు.

రక్త దానంతో మరొకరికి ప్రాణదానం : డాక్టర్ సౌమ్య



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సౌమ్య

పర్చూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణదానంతో సమానమని పర్చూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సౌమ్య అన్నారు. గురువారం స్థానిక వైద్యశాలలో నేషనల్ వాలంటీర్ బ్లడ్ డొనేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వచ్ఛందంగా రక్తదానం చేయటం అభినందనీయం అన్నారు. రక్త దానం చేయటం వల్ల మెరుగైన ఆరోగ్యం కూడా చేకూరుతుందన్నారు.



దోపిడీ తీరిది..

- సోమశిల జలాశయం నుంచి పెన్నానదికి నీరు విడుదల చేసిన కారణంగా 4 రోజులుగా జిల్లాలో ఇసుక అక్రమ రవాణా తగ్గుముఖం పట్టింది. అంతకుముందు సంగం, అనంతసాగరం, మినగల్లు, శ్రీరంగరాజపురం ఇలా జిల్లావ్యాప్తంగా అవకాశం దొరికిన అన్ని ప్రాంతాల నుంచి పెన్నా నదిని కుల్లబొడిచి అక్రమంగా ఇసుక తరలించుకొని వెళ్లారు.
- సంగం విషయానికి వస్తే ఇక్కడ డీసిల్టేషన్ పాయింట్‌కు ఎగువ ప్రాంతంలో పెన్నా నది నుంచి విపరీతంగా ఇసుక తవ్వి తరలించారు. గత వైసీపీ హయాం లో ఇసుక అక్రమ రవాణాలో ఆరితేరిన స్మగ్లర్ నేతృత్వంలో (ఇప్పుడు ఈయన తెలుగుదేశం పంచన చేరారు) వందల సంఖ్యలో టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు. రాత్రుల్లో ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్లు నింపడం, వాయువేగంతో పొరుగు ప్రాంతాలకు తరలించడం పరిపాటిగా మారింది. ఈ స్మగ్లర్ వెనుక తెలుగుదేశం పార్టీలో ఓ నాయకుడు ఉన్నాడు. ఆయన ఓ మాజీ ఎమ్మెల్యేకి సమీప బంధువు. టీడీపీలో చాలా మంది నాయకులకు అప్పుడు. ప్రస్తుతం ఈ ముఠా పెరుమాళ్లపాడు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు గ్రామస్థుల సమాచారం. వెంకటగిరి నియోజకవర్గం కలువాయి మండలం రాజుపాలెం నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలుతోంది.
- బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లు ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిలో వైసీపీకి చెందిన వారు ఉన్నారు. గత ప్రభుత్వంలో చేసినట్లే ప్రస్తుత ప్రభుత్వంలోనూ వారే చక్రం తిప్పుతున్నారు. జొన్నవాడ, శ్రీరంగరాజపురం ప్రాంతాల నుంచి రెండు ప్రధాన పార్టీలకు చెందిన కొందరు నాయకులు ఇసుక అక్రమ రవాణాలో భాగస్వాములుగా ఉన్నారు.
- **అనంతసాగరం :** గ్రీన్ ట్రిబ్యునల్, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అక్టోబరు 15 వరకు ఇసుక తరలింపునకు అనుమతుల్లేవు. అయితే, అనంతసాగరం మండలం పీకేపాడు రీచ్‌లో భారీ యంత్రాల ద్వారా ట్రాక్టర్ల కొద్దీ ఇసుక తరలిపోతోంది. జిల్లాకు చెందిన ఓ అమాత్యుడి సమీప బంధువే ఈ రీచ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.
- **మర్రిపాడు :** పడమటి కంభంపాడు రీచ్ నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. టిప్పర్ల దాటికి చిన్న వాహనదారులు భయం గుప్పిట్లో రాకపోకలు సాగిస్తున్నారు. రీచ్‌లో ఇసుక లోడ్ అయ్యాక తొలుత నకిరేకల్ - ఏర్పేడు (565) జాతీయ రహదారిపై ప్రయాణిస్తాయి. ఆ తరువాత చుంచులూరు నుంచి నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల మీదుగా బెంగళూరుకు వెళుతన్నాయి.
- **కందుకూరు :** కందుకూరు నియోజకవర్గంలో ఉన్న మన్నేరు ఇసుకను లారీలలో సరిహద్దులు దాటిస్తున్న అక్రమార్కులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. దప్పళంపాడు, కొళవళ్ల, మాచవరం, ఆత్మకూరు, మన్నేటికోట తదితర ప్రాంతాలలో నాణ్యమైన ఇసుక నిల్వలు ఉన్నాయి. దప్పళంపాడు చెక్‌డ్యాం పరిసరాల్లో అయితే వేల టన్నుల ఇసుక నిల్వలు ఉండగా, ఇసుకను ట్రాక్టర్లలో బయటకు తరలించి ఒక ప్రదేశంలో డంప్ చేసుకోవటం, రాత్రిపూట లారీలకు లోడ్‌చేసి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని కనిగిరి, మార్కాపురం, ఎర్రగొండపాలెం ప్రాంతాలకు అటు నుంచి హైదరాబాద్‌కు కూడా మన్నేరు ఇసుక తరలుతున్నట్లు సమాచారం.
- **కోవూరు/విడవలూరు :** కోవూరు మండలంలోని వేగూరు, జమ్మిపాళెంలోని అనధికార రీచ్‌ల నుంచి విడవలూరు మండలం ముదివర్తి రీచ్ నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కోవూరు, విడవలూరు మండలాల్లోని ట్రాక్టర్ల యజమానులు బృందంగా ఏర్పడి ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు జాతీయ రహదారిపై రాకుండా గ్రామీణ అడ్డరోడ్లలోనే రాకపోకలు సాగిస్తున్నాయి.

నాడు నేడూ వారే!

- అధికార పార్టీ ముసుగులో ఇసుక అడ్డగోలు దోపిడీ
- ప్రజాప్రతినిధుల అండ... నేతలదే ఇష్టారాజ్యం
- జిల్లా సరిహద్దులు దాటుతున్న ప్రకృతి సంపద
- రయ్.. రయ్‌మంటూ దూసుకెళుతున్న టిప్పర్లు
- వాటి వేగానికి ఛిద్రమవుతున్న బతుకులు
- శిక్షణ లేని డ్రైవర్ల చేతికి స్టీరింగ్‌లు
- మామూళ్ల మత్తు.. ఆపై ఒత్తిళ్లు
- కళ్లున్న కబోదిలా అధికార యంత్రాంగం

ఆంధ్రజ్యోతి పరిశీలన


నెల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగం మండలం పెరమన వద్ద ఏడుగురిని పొట్టనపెట్టుకున్న ఇసుక టిప్పర్ సాదాసీదాది కాదు. గత వైసీపీ హయాంలో ఇసుక స్మగ్లింగ్‌లో చెయ్యి తిరిగిన ఒక మాఫియా లీడర్ సారథ్యంలో నడిచేదిగా ప్రజలు చెప్పుకొంటున్నారు. ఈ మాఫియా లీడర్ ఇప్పుడు అధికార తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. ఈయన ప్రజాసేవకుడనో, ఈయన చేతిలో పదివేల ఓట్లు ఉన్నాయనో అయన్ను ఆ పార్టీలోకి తీసుకోలేదు. ఇసుక స్మగ్లింగ్‌లో చేయితిరిగిన ఘనుడని కొంతమంది నాయకులు ఈయన్ను పక్కన పెట్టుకున్నారు. రాజకీయ పరపతితో ఆ స్మగ్లర్‌ను కాపకాస్తున్నారు. ఈయన సారథ్యంలో వందల కొద్ది టిప్పర్లు నడుస్తున్నాయి. నకిరేకల్-ఏర్పేడు, నెల్లూరు-ముంబాయి జాతీయ రహదార్లపై ఈయన నేతృత్వంలోని టిప్పర్లు అడ్డూ అదుపులేకుండా రయ్.. రయ్..మంటూ దూసుకెళుతున్నాయి. మన ఇసుకను కొల్లగొట్టి పక్క జిల్లాలకు, రాష్ట్రాలకు తరలిస్తున్నాయి. ఈ టిప్పర్లను నడిపే డ్రైవర్లకు ఒకటే లక్ష్యం. శరవేగంగా గమ్యస్థానం చేరడం. వాటి వేగం దాటికి ఎదురొచ్చిన వాహనాలపై ఎక్కిస్తున్నారు. ఒకవైపు చట్ట వ్యతిరేకంగా ఇసుకను కొల్లగొడుతూ, మరోవైపు విపరీతమైన వేగంతో ప్రజల ప్రాణాలు హరిస్తున్న ఇలాంటి వాహనాలు పెన్నా పరివాహక ప్రాంతం అంతటా పెద్ద సంఖ్యలో తిరుగుతున్నాయి.

సీఎం ఆదేశాలూ బేఖాతర్

ఇసుక స్మగ్లింగ్‌కు పాల్పడితే తాట తీస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిస్తున్నా అధికారుల చెవికెక్కడం లేదు. స్మగ్లర్ల నుంచి అందే మామూళ్ల మీద ఉన్నంత ధ్యాస, సీఎం ఆదేశాలను అమలు చేయాలన్న విషయంలో లేకపోవడంతో పాలన పూర్తిగా గాడితప్పుతోంది. ఇసుక, గ్రావెల్ స్మగ్లింగ్‌లో గత వైసీపీకి, ఇప్పటి తెలుగుదేశం పార్టీకి ఏమాత్రం తేడా లేదనే భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది. అధికార పార్టీ ముసుగులో కొంతమంది చేసే ఈ అక్రమాల వల్ల ప్రభుత్వానికి, టీడీపీకి చెడ్డపేరు వస్తోందని ఆ పార్టీకి చెందిన నాయకులే ఆవేదన చెందుతున్నా, అక్రమార్కుల దాటికి జడిసి మనకెందుకొచ్చిందిలే అని మౌనం గా ఉండిపోతున్నారు. ఇది అక్రమార్కుల్లో మరింత నైతిక స్థైర్యం కలిగిస్తోంది.

శిక్షణ లేని డ్రైవర్లతో..

సంగం, అనంతసాగరం ప్రాంతాల నుంచి రాత్రుల్లో అక్రమంగా తరలించే ఇసుక టిప్పర్లతో చిన్న వాహనదారులకు భద్రత కరువయ్యింది. విపరీతమైన లోడుతోపాటు తగిన శిక్షణ లేని డ్రైవర్లు భారీ గూడ్స్ వాహనాలను తోలడంతో ఎటువైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందో అంతుపట్టని పరిస్థితి. భారీ గూడ్స్ వెహికల్స్‌ను కనీస శిక్షణ లేని డ్రైవర్లు నడుపుతున్నారనే విషయాన్ని ఇటీవల ఆర్టీయే అధికారులు గుర్తించడం గమనార్హం.



అవును.. అక్రమ తరలింపే!

- పోలీసుల విచారణలో బహిర్గతం
- డ్రైవర్‌తోపాటు టిప్పర్ యజమానిపై కేసు
- ఇసుక మాఫియా డాన్‌పై కూడా..
- తెర వెనుక ఓ ప్రజాప్రతినిధి మంత్రాంగం
- కేసు నీరుగార్చేందుకు విశ్వప్రయత్నం

సంగం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై పెరమన వద్ద ఏడుగురి ప్రాణాలను బలిగొన్న టిప్పర్‌లో తరలిస్తున్న ఇసుక అక్రమమేనని పోలీసుల విచారణలో బహిర్గతమైంది. అయితే ఈ విషయం బయటకు చెప్పడానికి పోలీసులు సంకోచిస్తున్నారు. ఈ మాఫియా వెనుక అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి హస్తం ఉండటంతో కేసు నమోదుకు పోలీసులు సంకోచిస్తున్నారు. అయితే, జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి ప్రమాదానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ అజితను ఇప్పటికే ఆదేశించిన విషయం విదితమే. ఈమేరకు ఇసుక అక్రమ తరలింపుపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులను ఆమె ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే, సదరు ప్రజాప్రతినిధి మాత్రం ఈ కేసులో ఇసుక మాఫియా డాన్‌తోపాటు టిప్పర్ యజమానిని తప్పించాలని పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

బుకాయింపు..

ప్రస్తుతం జిల్లాలో డీసిల్టేషన్ అనుమతి ఉన్న సంగం, సూరాయపాళెం పోతిరెడ్డిపాళెం డంపింగ్ కేంద్రాల నుంచి మాత్రమే ఇసుక తరలింపు. కానీ సంగం ఇసుక డంపింగ్ యార్డుకు ఎగువన పెరమన వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. అంటే టిప్పర్ ఆత్మకూరు వైపు నుంచి ఇసుక లోడుతో వచ్చింది. కాబట్టి ఇసుక తరలింపు ముమ్మాటికీ అక్రమమేనని పోలీస్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. అయితే పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన టిప్పర్ డ్రైవర్ మాత్రం ఓ నాయకుడికి చెందిన క్వార్ట్జ్‌లో ఇసుక నిల్వ ఉంటే తరలిస్తున్నట్లు చెప్పినా, అక్కడా ఇసుక లేకపోవడంతో కేసు నుంచి తప్పించుకునేందుకు మాఫియా ఆడుతున్న నాటకమని పోలీసులు నమ్మడం లేదు. ఇది తెలుసుకున్న ఎస్పీ ప్రమాద ఘటనతోపాటు ఇసుక అక్రమ తరలింపులో ఉన్న వారిపైన కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు.

తెర వెనుక నేతలు

గత ప్రభుత్వంలో ఇసుక మాఫియా డాన్‌గా వ్యవహరించిన నియోజకవర్గంలోని ఓ వ్యక్తే ప్రస్తుత ప్రభుత్వంలోనూ మాఫియా నడుపుతున్నారని

- మిగతా 7లో..



అనంతసాగరం: పీకేపాడు రీచ్‌లో బయట పడ్డ భూగర్భజలాలు



అనంతసాగరంలో ట్రాక్టర్



మర్రిపాడు దూసుకెళుతున్న టిప్పరు



ఉలవపాడు : ఆత్మకూరు వద్ద మన్నేరులో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్



కందుకూరు ప్రాంతంలో రాత్రిపూట..



కోవూరు : పెన్నాతీరం నుంచి..

'విజయ'లో ఎన్నికల కోలాహలం

- వివరాలు 8లో..

'వాహన మిత్ర' దరఖాస్తుకు నేటితో గడువు పూర్తి

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆటో, మాక్సీ క్యాబ్ వాహన యజమానులు వాహన మిత్ర పథకం కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని సూచించారు. వాహన రిజిస్ట్రేషన్ కార్డు, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర సర్టిఫికెట్లతో దరఖాస్తులు అందించాలని, బ్యాంక్ ఖాతాకు ఆధార్, ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు మరలా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



కసుమూరు, ఏఎస్‌పేటలో భక్తుల సందడి

భక్తసు'గంధం'!

వెంకటాచలం మండలం కసుమూరు మస్తాన్‌వలి 248వ గంధమహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. దర్గాను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అలాగే ఏఎస్‌పేటలోని శ్రీహజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా 252వ గంధమహోత్సవాన్ని గురువారం అర్ధరాత్రి నిర్వహించడానికి అన్నీ సిద్ధం చేశారు.

వెంకటాచలం : కసుమూరులోని మస్తాన్‌వలి దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

8



ఏఎస్‌పేటలో గంధం దంచుతున్న ముస్లిం మత పెద్దలు

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

సంగం, (ఆంధ్రజ్యోతి): పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ సంఘటనలో తాళ్లూరు శ్రీనివాసులు, రాధ, చల్లగుండ్ల శ్రీనివాసులు, లక్ష్మీ అనే దంపతులతోపాటు శేషం సారమ్మ, వేషం బాలవెంగయ్య, కారు డ్రైవర్ కత్తి బ్రహ్మయ్య మొత్తం ఏడుగురు మృతి చెందిన విష యం విదితమే. దీంతో ఒక్కో మృతుడికి రూ.5లక్షల చొప్పున సీఎం సహాయనిధి నుంచి బాధితులకు అందచేయాలని అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థుల కార్యక్రమం వాయిదా

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా మెగా డీఎస్సీ-2025 నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాల అందచేత కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం గుంటూరులో భారీ వర్షాల ఉన్నందున అభ్యర్థుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేశారన్నారు. త్వరలో కార్యక్రమ నిర్వహణ తేదీలను ప్రకటిస్తామని తెలిపారు.

కరేడులో రైతులకు పరిహారం

- 368.19 ఎకరాలకు 78.18 కోట్లు
- రైతుల ఖాతాల్లో నగదు జమ

కందుకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చేదిలేదంటూ రైతులు ఓ వైపు నిరసనలు చేస్తుండగా మరోవైపు భూసేకరణ ప్రక్రియ సాగిపోతోంది. ఇప్పటికే 1300 ఎకరాలకు సంబంధించిన రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకారపత్రాలు ఇవ్వగా ఇప్పటికి నాలుగు విడతలుగా 186 మంది రైతులకు సంబంధించిన 368.19 ఎకరాలకు పరిహారంగా 78.19 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో జమచేశారు. మిగిలిన భూములకు సంబంధించి కూడా రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసి రైతుల ఖాతాలకు నగదు జమచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు భూసేకరణ అధికారి రాజశేఖర్ తెలిపారు. ఇండోసోల్ సోలార్ పరిశ్రమ ఏర్పాటుతో వేలాదిమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని ఈ ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తుందన్న లక్ష్యంతో ప్రభుత్వం భూసేకరణ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవటంతో ఇటు అధికార యంత్రాంగం అటు ఇండోసోల్ సోలార్ కంపెనీ ప్రతినిధులు రైతులను కలుస్తూ భూసేకరణ ప్రక్రియకు వారినుంచి అంగీకారపత్రాలను తీసుకోవటంలో సఫలమయ్యారు. బయటి గ్రామాలకు సంబంధించి అంగీకారపత్రాలు స్వీకరణ దాదాపు పూర్తయినట్లేనని, ఇకపై భూసేకరణ అడుగు ముందుకు పడాలంటే కరేడు రైతుల నుంచి మార్పు అవసరం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

లక్కీడ్రాలో 12 బార్‌ల కేటాయింపు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా తొలి నోటిఫికేషన్‌లో మిగిలిన 33 బార్లకు కలెక్టరేట్‌లో గురువారం ఉదయం కలెక్టర్ హిమాన్షు శుక్లా బార్లకు లాటరీ నిర్వహించారు. ఈ క్రమంలో నగరంలో 7 బార్లు, కావలిలో 3, బుచ్చిలో 1, గీత కార్మికులకు సంబంధించి అల్లూరులో ఒక బారుకు లాటరీ తీశారు. ఈ సందర్భంగా లాటరీలో విజేతలుగా నిలిచిన వ్యాపారులకు బార్లు కేటాయించారు. మిగిలిన 21 బార్లకు మరోమారు నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో డీసీ శంకరయ్య, ఈఎస్ శ్రీనివాసుల నాయుడు, ఏఈఎస్ రమేష్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సోమశిలకు 18,715 క్యూసెక్కుల వరద

అనంతసాగరం సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 18,715 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. డ్యాంలో నీటి నిల్వ 73.268 టీఎంసీలకు చేరుకోగా, దిగువ డెల్టాకు పవర్ టన్నెల్ నుంచి 350, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఏఆర్ ఏఎస్పీ మునిరాజ్ బదిలీ

4 నెలల తర్వాత జీవో ● కిలేడీ' విషయంలోనే అప్పట్లో బదిలీ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 18((ఆంధ్రజ్యోతి) : చాలా రోజుల తర్వాత కిలేడి' అరుణ విషయం చర్చగా మారింది. గతంలో ఏఆర్ ఏఎస్పీగా ఉన్న ఓ అధికారి లేడీ డాన్‌తో మాట్లాడిన మాటలు సంచలనంగా మారాయి. ఈ క్రమంలో గతంలోనే జిల్లాకు చెందిన ఆ ఏఎస్పీని జిల్లా నుంచి బయటకు పంపిన విషయం తెలిసిందే. అయితే నాలుగు నెలల తర్వాత ఆ అధికారిని నెల్లూరు నుంచి డీజీ కార్యాలయానికి బదిలీ చేస్తున్నట్లు గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

కావలి రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు ట్రంక్ రోడ్డులో గురువారం రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ రామిశెట్టి నవీన్‌కు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. కావలి నుంచి చేపల లోడుతో నెల్లూరు వైపు వెళ్తున్న లారీ ట్రంక్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా మరో వాహనం రోడ్డుపై చేరిన వర్షపు నీటిలో వేగంగా రావటంతో ఆ నీరు ఎగిరి చేపల లోడుతో వెళ్తున్న లారీలోని డ్రైవర్‌పై పడ్డాయి. దీంతో లారీని ఒక్కసారిగా ఆపటంతో కావలి నుంచి చంద్రబాబు కాలనీకి వెళ్తున్న ఆటో లారీ వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలయ్యాయి.

ఎస్సీ అట్రాసిటీ కేసులో రెండేళ్ల జైలు

ఉలవపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దళిత మహిళలను కులం పేరుతో దూషించి, దాడిచేసిన కేసులో ఒంగోలు 7వ ఏడీజే కోర్టు ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.1200 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. 2020 ఆగస్టు 8న కరేడుకి చెందిన యానాది కులానికి చెందిన మహిళ గేదెను మేత కోసం పొలానికి తోలుకెళ్లింది. ఈ క్రమంలో అదేగ్రామానికి చెందిన ముద్దాయి నక్కా రమేష్ (33) పొలం గట్టుపైన గేదెను తోలుకెళుతుండగా సదరు ముద్దాయి తన పొలంలో గేదెను మేపుతావా? అంటూ బాధిత మహిళను కులం పేరుతో దూషించడమే కాకుండా భౌతికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు తన కుమారుడితో కలిసి అదేరోజు ఉలవపాడు పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి కందుకూరు డీఎస్పీ కండే శ్రీనివాసరావు దర్యాప్తు చేసి చార్జిషీటు కోర్టుకు దాఖలు చేశారు. సాక్ష్యాలను పొందుపరిచారు. ఈ కేసుపై ఐదేళ్ల విచారణ అనంతరం ఒంగోలులోని 7వ ఏడీజే జడ్జి టీ రాజావెంకటాద్రి గురువారం ఈ మేరకు తీర్పు వెల్లడించారు. కేసును వాదించడంతో ప్రతిభ కనబరచిన స్పెషల్ పీపీ పై ప్రశాంతి కుమారి, కేసు విచారణ చేపట్టిన డీఎస్పీ కండే శ్రీనివాసరావు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లును ఎస్పీ డాక్టర్ అజిత వెజండ్ల అభినందించారు.

ఆవుల శ్రీనివాసులు హత్య కేసును ఛేదించిన పోలీసులు

● ఇరువురి అరెస్ట్... రిమాండ్‌కు తరలింపు

లింగసముద్రం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్లలో ఈనెల 9న జరిగిన ఆవుల శ్రీనివాసులు హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇరువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుడ్లూరు సీఐ జీ. మంగారావు గురువారం ఓ ప్రకటనలో కేసు వివరాలను వెల్లడించారు. శ్రీనివాసులు ఇంటి వరండాలో ఒంటరిగా నిద్రిస్తుండగా, అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీనివాసులును ఆయుధంతో బలంగా కొట్టి చంపారని ఆయన పెద్ద కుమార్తె మనీషా లింగసముద్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గుడ్లూరు సీఐ మంగారావు దర్యాప్తు చేపట్టారు. మృతుడు శ్రీనివాసులుకు ఐదు సంవత్సరాల క్రితం భార్య చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ఆవుల శ్రీదేవితో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. అయితే వలేటివారిపాలెం మండలంలోని బొంతవారిపాలెంకు చెందిన సాదం రాజేంద్రప్రసాద్‌తో శ్రీదేవి వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం తెలిసిన మృతుడు శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో అసూయతో ముద్దాయిలిద్దరు మృతుడు శ్రీనివాసులును ఇనుప హెక్‌తో అతి కిరాతకంగా కొట్టి చంపారు. దీంతో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు ముద్దాయిలను అరెస్ట్ చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారికి రిమాండ్ విధించింది. ఈ హత్య కేసు ఛేదింపులో సీఐకి సహకరించిన ఎస్ఐ ఎం.నారాయణ, కానిస్టేబుళ్ళు మునికృష్ణ, నారాయణ, మీరాబాషా, నజ్రుల్లా, ప్రదీప్ కుమార్, హెచ్‌జీ శ్రీనివాసులును పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

పొగాకు నారుమళ్ల పెంపకానికి అనుమతులు తప్పనిసరి

కలిగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కలిగిరి పొగాకు వేలంకేంద్రం పరిధిలో పొగనారుమళ్ళు సాగుచేసే రైతులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని వేలం నిర్వహణాధికారి వి శివకుమార్ తెలిపారు. గురువారం వేలం కేంద్రం పరిధిలోని రాచవారిపల్లి, దుత్తలూరు లక్ష్మీపురం గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పొగాకు నారుమళ్లను బోర్డు అధికారులు, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా నారుమళ్ళ సాగులో యజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన నారుఉత్పత్తి చేయాలని కోరారు. అదేవిధంగా పొగాకు నర్సరీలు, నారుమళ్లు అనుమతి లేకుండా సాగుచేస్తే పొగాకుబోర్డు చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. అదేవిధంగా అనుమతి లేకుండా సాగుచేసిన వారివద్ద నారు కొనుగోలుచేసి రైతు పంట వేసినా వారి బ్యారన్ లైసెన్సు రద్దుచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్రాధికారి సంతోష్‌కుమార్, క్షేత్రసహాయకులు హజరత్‌బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో చక్కటి ఆరోగ్యం

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం సాధ్యమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రుబీనా తెలిపారు. మండలంలోని శింగమనేనిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 8వ రాష్ట్ర పోషణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

కసుమూరు గంధోత్సవంలో కిక్కిరిసిన భక్తులు

వెంకటాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మస్తాన్ వలి 248వ గంధమహోత్సవం సందర్భంగా కసుమూరు గురువారం భక్తులతో కిక్కిరిసింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దర్గాను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. దర్గాతోపాటు బంగళా వద్ద దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● వర్షంతో ఇబ్బందులు



కసుమూరులో భక్తులతో కిక్కిరిస్తున్న దర్గా ప్రధానమార్గం

గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భక్తులు తలదాచుకోవడానికి అగచాట్లు పడ్డారు. కూర్చోవడానికి కూడా వీలు లేక తంటాలు పడ్డారు. వర్షం పడడంతో కసుమూరు దర్గా ప్రధానమార్గం, పరిసరాలు, గంధమహోత్సవం ప్రారంభమయ్యే చందన్‌మహల్ (బంగళా) ప్రాంగణమంతాట బురదమయమైపోయింది. ఆ చిత్తడితో భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. తిరిగేందుకు భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

● అధికారుల వైఫల్యం

గంధమహోత్సవం ఏర్పాట్లు చేయడంలో వక్ఫ్‌బోర్డు అధికారులు విఫలమయ్యారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. బంగళా వద్ద నామమాత్రంగానే షామియానాలు ఏర్పాటు చేశారు. దీంతో బురదమయమైన నేలపైనే పట్టలు వేసుకుని సేదతీరారు. కనీసం చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. అవసరం ఉన్నచోట్ల మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఏఎస్‌పేటలో గంధమహోత్సవ ఏర్పాట్లు

ఏఎస్‌పేట,సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి):శ్రీహజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా 252వ గంధమహోత్సవాన్ని గురువారం అర్ధరాత్రి నిర్వహించడానికి అన్ని సిద్ధం చేశారు. వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.దర్గా దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు, అన్నదానం,తాగునీరు,ప్రత్యేక వైద్య శిబిరం, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దర్గాలోని సమాధుల దర్శనానికి భక్తులు పోటెత్తారు.దర్గా పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.దర్శనం కోసం క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ప్రత్యేకంగా విద్యుత్‌దీపాలతో దర్గాను అలంకరించారు. కాగా గురువారం మహల్‌లో దర్గా ఈవో మహమ్మద్ హుసేన్,దర్గా సజ్జాద షాగులాం నక్షబంద్ పయాజ్,పలువురు నాయకులు, అధికారులు గంధం దంచే కార్యక్రమన్ని ప్రారంభించారు.అనంతరం మహిళ భక్తులు గంధం దంచారు. కాగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందక భక్తులు ఇబ్బంది పడ్డారు.



విద్యుత్ దీపాలంకరణలో నాయబ్ రసూల్ దర్గా

జాతీయ ఎన్‌సీసీ శిబిరానికి అభిషేక్

● మున్సిపల్ పాఠశాల విద్యార్థికి అభినందన



కేడెట్ అభిషేక్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మంజుల

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాంప్‌నకు నెల్లూరులోని వెంగళరావునగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల పదో తరగతి విద్యార్థి వీ అభిషేక్ పాల్ ఎంపికయ్యాడు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సీ మంజులవాణి మాట్లాడుతూ తమ విద్యార్థి 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ కేడెట్‌గా జాతీయ శిబిరానికి ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. నంద్యాలలో శనివారం నుంచి జరిగే ఈ శిబిరంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచారాలు, భాషలు, జీవనశైలి, జాతీ య సమైక్యత, సమగ్రత తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, ఉపాధ్యాయులు, కేడెట్స్ పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో బూతు పురాణం

దుత్తలూరు(ఉదయగిరి), (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో గురువారం ఇద్దరు ఉద్యోగులు ఒకరితో ఒకరు బూతు పురాణంతో తిట్టుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. కార్యాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కన్సల్టెంట్ హజరత్తయ్య, సాంకేతిక సహాయకుడు సునీల్ ఒక పనికి సంబంధించి ఎంబుక్ తయారీలో తీవ్రస్థాయిలో తిట్టుకుంటూ వాగ్వివాదానికి దిగారు. సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్న విషయాన్ని సైతం మరిచి ఒకరికొకరు రెచ్చిపోయారు. అక్కడే ఉన్న ఏపీవో బ్రహ్మయ్య వారిని ఎంత సముదాయించినా వారు పట్టించుకోలేదు. వారి తిట్ల దండకంతో చుట్టుపక్కల కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలు సైతం అవాక్కయ్యారు.

కారుణ్య నియామకం చేపట్టండి

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విధులు నిర్వహిస్తూ రైలు ప్రమాదంలో మృతి చెందిన హెల్త్ అసిస్టెంట్ నక్కా రాంకుమార్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కేటాయించాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు రాంకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేట్లు, కుటుం బ సభ్యులలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చేటట్లు చూస్తా మని డీఎంహెచ్‌వో హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు, బాధితులు ఏవో నిషాంత్‌రెడ్డిని కలిసి సాయం కోరారు. హంస నెల్లూరు సిటీ అధ్యక్షుడు గౌస్‌బా షా, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, అదనపు కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న ఇసుక బకాసురులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సంగం మండలం పెరమన వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందటం బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇసుక బకాసురుల కారణంగా ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల నష్టపరిహారం, ప్రమాదానికి కారణమైన వారి నుంచి మరో రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని కోరారు.



సంగం సమీపంలోని పెరమన వద్ద జరిగిన ప్రమాదంలో టిప్పరు నుంచి కారును తొలగిస్తున్న క్రేన్ (ఫైల్)

ఇటీవల జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నవారి సంఖ్య పెరుగుతూ ఉంది. బుధవారం సంగం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. రహదారి ప్రమాదాల్లో కుటుంబాలు ఛిద్రమవుతున్నా వీటిని అరికట్టడంలో అన్ని శాఖల అధికారులు విఫలమవుతున్నారు. అధికారుల సమన్వయం పేరుతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ, ప్రమాదాల నివారణకు రూపొందిస్తున్న కార్యాచరణ మాటలకే పరిమితం అవుతోంది.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

సమీక్షలతో సరి.. కార్యాచరణ ఏదీ!?

- 'బ్లాక్ స్పాట్'లలో కానరాని చర్యలు
- హైవేపై ఇష్టానుసారంగా ఫుడ్ కోర్టులు, డాబాలు
- మద్యం, నిద్రమత్తులో ప్రమాదాలు
- రక్తమోడుతున్న రహదారులు
- ప్రమాదాల నివారణలో అధికారుల వైఫల్యం

జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతి వేగం, నిద్రమత్తు, మద్యం సేవించి వాహనం నడపడంతోపాటు రోడ్డు పక్కన ఇష్టానుసారంగా వాహనాలను ఆపడమే. దీనికితోడు జాతీయ రహదారుల వెంట ఇటీవల కాలంలో ఫుడ్ కోర్టులు, డాబాలు, బార్లు, మద్యం దుకాణాలు పెరిగాయి. రోడ్లకు పక్కనే చిన్నపాటి బండ్లు, షెల్టర్‌లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తుండడతో వాహనాలు హైవేపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఈ అంశాలపై దృష్టి సారించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● ఐదేళ్లలో...

2020లో జిల్లాలో 943 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 398 మంది మరణించారు, 944 మంది క్షతగాత్రులయ్యారు. 2021లో 977 ప్రమాదాలు జరగ్గా, 466 మంది మృతిచెం ది, 1006 మంది క్షతగాత్రులయ్యారు. 2022లో 884 ప్రమాదాలు జరగ్గా, 368 మంది మృతి చెంది, 974 మంది క్షతగాత్రులయ్యారు. 2024లో 828 ప్రమాదాలు జరగాయి. 450 మంది మృత్యువాత పడగా, 905 మంది క్షతగాత్రులయ్యారు. 2022లో ఇప్పటి వరకు 663 ప్రమాదాలు జరగ్గా, 384 మంది మృతి చెందారు, 645 మంది క్షతగాత్రుల య్యారు.

● రెస్ట్ ఏరియాలు ఉన్నా..

నెల్లూరు-బద్వేలు రోడ్డులో రెండు, ఏర్పేడు-రాపూరు జాతీయ రహదారిలో రెండు, పోర్టుకు వెళ్లే రూట్‌లో ఒకటి, వెంకటాచలం వద్ద, ఆత్మకూరుకు వెళ్లే దారిలోనూ... ఇలా జాతీయరహదారిపై వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేశారు. అయితే వాహనదారులు వాటిని పెద్దగా ఉపయోగించడం లేదు. గౌరవరం, వెంకటాచలం ప్రాంతాల్లో మాత్రం రెస్ట్ ఏరియాలను వాహనదారులు కొంత మేరకు వినియోగిస్తున్నారు. రెస్ట్ ఏరియాల్లో కాకుండా ఇష్టానుసారంగా జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం ద్వారా, బ్రేక్‌డౌన్ అయిన వాహనాలను రోడ్లోనే ఉంచి రిపేర్లు చేయడం ద్వారా వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీ కొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

● అనుభవం లేకుండా...

కరోనా తర్వాత ఇంటికో కారు అన్నట్లుగా పరిస్థితులు ఏర్పడాయి. ఫైనాన్స్ కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి తక్కువ డౌన్ పేమెంట్‌కు కార్లను డెలివరీ ఇచ్చేస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు సొంత కార్లు, బంధువుల వద్ద ఉండే కార్లలో శుభ, అశుభ కార్యాలకు ప్రయాణాలు చేస్తున్నారు. జాతీయ రహదారిపై, దూరప్రాంతాలకు కార్లు నడిపేవారు అనుభవం లేకున్నా వచ్చి రానీ డ్రైవింగ్‌తో కారు స్టీరింగ్ పట్టుకొని రోడ్డుపైకి వెళుతున్నారు. దీంతో వేగాన్ని నియంత్రించలేక, వాహనాల రద్దీలో వాహనం నడిపే నైపుణ్యం లేకుండా, అధిక సమయం నిద్ర మేలుకొని ప్రమాదాల బారిన పడుతున్నారు.

● బ్లాక్‌స్పాట్‌లపై కానరాని దృష్టి

మూడు క్యాలెండర్ సంవత్సరాల్లో ముగ్గురు కంటే ఎక్కువ గా ఒకే ప్రాంతంలో మంరణించి ఉంటే, ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్ గా గుర్తిస్తారు. ఇక్కడ ప్రమాదాల నివారణతోపాటు ప్రమాదాలను తగ్గించడం కోసం జిల్లా రహదారి భద్రతా మం డలి సమావేశం ఏర్పాటు చేసుకొని, నివారణ చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేస్తారు. అయితే ఈ ప్రణాళికలను పాటించడంలో అన్నీ శాఖలు విఫలమవుతున్నాయి. వాహనాల స్పీడ్‌ను తగ్గించలేకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని అదుపు చేయకపోవడం, రోడ్డుకు పక్కనే నిలిపే అక్రమ పార్కింగ్‌ను అడ్డుకోవడం, బ్లాక్ స్పాట్‌లలో నిరంతరం పోలీసు సిబ్బంది ఉండక పోవడం, తదితర నివారణ చర్యలపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఇక జాతీయ రహదారి సిబ్బంది వారి పనులు వారు చూసుకోవడానికే సమయం లేదన్న మాటలు వినిపిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణపై అన్నీ శాఖలు దృష్టి సారిస్తే, ప్రమాదాల సంఖ్య తగ్గుతుంది.



బోగోలు కార్యదర్శిపై చర్యలకు సిఫార్సు

● సర్పంచికు షోకాజ్ నోటీస్ జారీ

కావలి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి) కావలి డివిజన్‌లోని బోగోలు గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఆ పంచాయతీ కార్యదర్శి షేక్ అబ్దుల్ జహీర్‌పై క్రమశిక్షణా చర్యలకు పంచాయతీరాజ్ కమిషనర్‌కు సిఫార్సు చేసినట్లు డీపీవో శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సర్పంచి పీ. అనిత చెక్‌పవర్‌ను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆ పంచాయతీలో నిధులు దుర్విని యోగం జరిగాయని, మద్దిబోయిన వీరరఘు, ప్రస్తుత పాలకవర్గ సభ్యులు గతంలో అధికారులకు ఫిర్యాదు లు చేశారు. ఈ ఫిర్యాదులపై కావలి డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శిగా అబ్దుల్ జహీర్ డ్రాచేసిన నిధుల్లో రూ.30 వేలు దుర్వినియోగం అయ్యాయని తేలింది. అలాగే రూ.33,49,035లు అభ్యంతర ఖర్చు చేయటంతోపాటు పలు అవకతవకలు జరిగాయని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోనున్నట్లు డీపీవో పేర్కొన్నారు.

'విజయ'లో ఎన్నికల కోలాహలం

● డైరెక్టర్ల పోస్టులకు మూడింటికి నోటిఫికేషన్ ● నెలాఖరుతో ముగుస్తున్న కొండ్రెడ్డి పదవీకాలం ● చైర్మన్ రేసులో పలువురు బోర్డు డైరెక్టర్లు



నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి(విజయ డెయిరీ)లో మూడు డైరెక్టర్ పోస్టుల ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల అధికారి బీ. హరిబాబు నిర్వహణ బాధ్యతలు చేపడుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. విజయడెయిరీ పాలకవర్గంలో 15 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ప్రతి ఏటా ముగ్గురు సభ్యుల పదవీకాలం రొటేషన్ పద్ధతిలో ముగుస్తుంది. ఈ క్రమంలో ఈనెలాఖరుకు ప్రస్తుత చైర్మన్, అల్లూరు మండలం నార్త్‌మోపూరు పాలసొసైటీ సభ్యుడు కొండ్రెడ్డి రంగారెడ్డి, బాలాయపల్లి మండలం వెంగమాంబపురం సొసైటీ సభ్యురా లు సూదలగుంట సాయినిరోషా, కోవూరు మం డలం మోడెగుంట పాలసొసైటీ సభ్యురాలు క న్నా ఇందిరమ్మ పదవీకాలం ముగియనున్నది.

● 22న నామినేషన్

ఈ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు ఈనెల 22న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగం ట వరకు నామినేషన్‌లు స్వీకరిస్తారు.అదే రోజు మధ్యాహ్నం నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. 23న సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అభ్యర్థుల మధ్య పోటీ ఉంటే ఈనెల 27న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుంది.

● చైర్మన్ రేసులో పలువురు డైరెక్టర్లు

విజయడెయిరీ చైర్మన్‌గా ఇప్పటివరకు ఉన్న వైసీపీకి చెందిన కొండ్రెడ్డి రంగారెడ్డి పదవీకాలం ఈనెలాఖరుతో ముగియనున్నది. కాగా ఈ పదవికి టీడీపీకి చెందిన పలువురు బోర్డు సభ్యులు పోటీ పడుతున్నట్లు సమాచారం. అయితే ఖాళీ అవుతున్న మూడు స్థానాల్లో ఎవరిని పోటీ చేయించాలి.ఫలితాల అనంతరం మొత్తం బోర్డు సభ్యులు 15 మందిలో చైర్మన్ పదవి ఎవరికి కట్టబెట్టాలన్న విషయంపై టీడీపీ అధిష్ఠానం ఇప్పటికే దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రధానంగా ఇద్దరు డైరెక్టర్ల మధ్య పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరివైపు మొగ్గు చూపుతారో వేచి చూడాలి.

బంగారు నగలు దొంగలించిన మహిళల అరెస్టు

పొదలకూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా నుంచి వచ్చి పొదలకూరు పట్టణంలోని పలు బంగారు దుకాణాల్లో వస్తువులను కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ నగలను కాజేసిన మహిళలను వ్యాపారస్తులు గుర్తించి గురువారం పోలీసులకు అప్పగించారు. కృష్ణాజిల్లాకు చెందిన జ్ఞానమ్మ, ఆదెమ్మలు మరో మహిళతో కలిసి పొదలకూరులోని వివిధ దుకాణాల్లో సుమారు రూ2 లక్షల విలువ చేసే 7 జతల కమ్మలు దొంగిలించారు. పలు దఫాలుగా జరిగిన ఈ దొంగతనాన్ని గుర్తించకపోవడంతో మరోమారు దొంగిలించేందుకు వచ్చిన వీరిని బంగారు దుకాణ వ్యాపారస్తులు చాకచక్యంగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ముగ్గురిలో ఒకరు తప్పించుకోగా జ్ఞానమ్మ, ఆదెమ్మలపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పిడుగుపాటుకు ఒకరికి గాయాలు

వెంకటాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో గురువారం పిడుగుపాటుతో సుమారు రూ. 80 వేల విలువ గల ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన కోటయ్య, కరయ్య ఇళ్లపై పిడుగు పడింది. దీంతో ఈ రెండు ఇళ్లల్లోని ఎలక్ట్రికల్ వస్తువులతోపాటు ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో వెంకటేష్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. దుత్తలూరు మండలంలోని వెంకటంపేట గ్రామ సమీపంలోని ఓ మలుపు వద్ద మోపె డ్ వాహనం బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మర్రిపాడు మండలం ఇస్కపల్లి గ్రామానికి చెందిన వెంకటనరసింహం(50) పని నిమిత్తం ఉదయగిరికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈ తరుణంలో వెంకటంపేట మలుపు వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అటుగా వస్తున్న వాహనదారులు గమనించి 108 వాహనానికి సమాచా రం ఇవ్వడంతో వారు వచ్చేసరికి మృతిచెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



వింజమూరు : మృతిచెందిన ట్యాంకర్ డ్రైవర్



సంగం : రోడ్డుప్రమాదంలో మృతి చెందిన గార్ల వెంకటేశ్వర్లు

● కల్వర్టును ఢీకొని..

వింజమూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యో తి): మండలంలో ఊటుకూరు సమీపంలో కల్వర్టును ఢీకొని మినీ డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పో లీసులు తెలిపారు. బద్వేల్ నుంచి మినీ డీ జిల్ ట్యాంకర్ మండలంలోని క్లస్టర్ దగ్గర కు వస్తూ ఊటుకూరు సమీపంలో రాగానే ప్రమాదవశాత్తు కల్వర్టును ఢీకొనగా ట్యాంకర్ ముందుభాగం దెబ్బతిన్నడంతో డ్రైవర్ నవీన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడని తెలిపారు. మృతుడు నవీన్ (24)కు భార్య పసిబిడ్డ ఉన్నారు. కలిగిరి సీఐ వెంకటరమ ణ స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన సమాచారాన్ని తెలుసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● ట్రాక్టర్‌ను ఢీకొని..

సంగం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘ టన మండల పరిధిలోని సిద్దీపురం వద్ద ముంబాయి జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగింది. వివరాల మేరకు.. కొండా పురం మండలం వెలిగొండ్ల గ్రామానికి చెంది న గార్ల వెంకటేశ్వర్లు (50) మోటార్‌బైక్‌పై నెల్లూరు వెళ్తూ మార్గమధ్యంలో సిద్దీపురం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్ తొట్టిను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో అత నికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కి సమాచారం అందించారు. వారు వచ్చి పరీక్షించగా అప్పటికే మృతిచెందాడు. ఈమేర కు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లెక్కింపునకు నోచని హుండీలు

● దర్గాలో గుట్టలుగా పడి ఉన్న వైనం ● భక్తుల ప్రదక్షిణకు ఇక్కట్లు ● సుమారు రూ.3 కోట్ల నగదు ఉండవచ్చని అంచనా

ఏఎస్‌పేట,సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఆ దర్గాలోకి వెళ్లగానే గుట్టలు, గుట్టలుగా దుప్పట్లు, పట్టలు కప్పిన హుండీలు దర్శనమిస్తాయి. వీటిని చూసి భక్తులు అవాక్కవుతున్నారు. దర్గాలో సమాధులు దర్శించుకోవాలని వస్తే .. ఇలా హుండీలు కనిపిస్తున్నాయని, వీటిని ఇలా ఎందుకు వదిలేశారని భక్తులు చర్చించుకుంటున్నారు. ఏఎస్ పేటలోని హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గాను సుమారు మూడేళ్ల క్రితం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధీనంలోకి తీసుకుంది. వక్ఫ్ బోర్డు ఆధీనంలోకి తీసుకున్నాన 11నెలలకు మొదటిసారి హుండీలు లెక్కించారు. ఆ సమయంలో రూ. 1,60,000 నగదు వచ్చింది. ఈ క్రమంలో హుండీలలో తనకు వాటా కావాలని మాజీ ముతవలి కోర్టుకు వెళ్లారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు హుండీల లెక్కింపు జరగలేదు.

● ఆగిన లెక్కింపు

దర్గాలోకి వెళ్లే ప్రధాన ద్వారం దగ్గర,లోపల సమాధుల వద్ద, పురుషుల మసీదు ద్వారం దగ్గర, మహిళల మసీదు ద్వారం వద్ద , దర్గా వెలుపల జెండా వద్ద.. ఇలా మొత్తం ఐదు హుండీలను ఏర్పాటు చేశారు. ఈ ఐదు హుండీల ద్వారా సుమారు రూ.1,60,000 నగదు వస్తే.. అందులో ప్రధాన ద్వారం, సమాధుల వద్ద ఉన్న రెండు హుండీల ద్వారా సుమారు రూ.1,33,000 ఆదాయం వచ్చింది.ఈ రెండు హుండీలను తనకు కేటాయించాలని మాజీ ముతవల్లి కోర్టుకు వెళ్లారు.దీంతో హుండీల లెక్కింపు ఆగిందని దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ తెలిపారు.



దర్గాలో పట్టలు, దుప్పట్లు కప్పి ఉన్న హుండీలు

● ఎక్కడ చూసినా హుండీలే...

సుమారు 19 నెలలుగా హుండీలు లెక్కించకపోవడంతో సుమారు 19 హుండీలు నిండాయి. వాటిని దర్గాలోనే ఒక పక్కగా ఉంచి, వాటిపై దుప్పట్లు,పట్టాలు కప్పి భద్రపరిచారు.ప్రస్తుతం దర్గాలో మరో ఐదు హుండీలు ఏర్పాటు చేసి ఉన్నారు.అవి అమ్మవారు గంధమహోత్సవ సమయంలో కొంతవరకు నిండాయి.గురువారం నుంచి జరిగే నాయబ్ రసూల్ గంధమహోత్సవంతో పూర్తిగా నిండనున్నాయి. దీంతో ఇంకా హుండీలు ఎక్కువ అవుతాయి. ఈ క్రమంలో దర్గా మొత్తం హుండీలే దర్శనం ఇస్తాయని భక్తులు అంటున్నారు.

● రూ. 3 కోట్లు ఉండవచ్చు..

ఇప్పటి వరకు నిండిన హుండీలలో సుమారు రూ. 3కోట్లు ఉండవచ్చని అంచనా. గంధ మహోత్సవం అనంతరం నిండే హుండీల ద్వారా మరో రూ. కోటి వరకు రావచ్చని అంచనా వేస్తున్నారు.దర్గా అభివృద్ధి కోసం భక్తులు హుండీలలో వేసిన కానుకలు ఉపయోగం లేకుండా ఇలా నిల్వ చేయడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.దీనికితోడు దర్గా లోపల భక్తులు ప్రదక్షిణలు చేయడానికి ఉండే కొద్ది స్థలాన్ని హుండీలు ఆక్రమించడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.